ప్రజాశక్తి

ఆదివారం 26 ఫిబ్రవరి 2023

8 పేజీలు

విశాఖపట్నం అనకాపల్లి

విశాఖ కేంద్రంగా.. మత్తు పదార్థాల రవాణా

- ఇతర రాష్ట్రాలకు నగరం మీదుగా 71.3 శాతం సరఫరా
- పెరుగుతున్న డ్రగ్ పెడ్లర్ల సంఖ్య

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : మెట్రో పాలిటన్ నగరంగా శరవేగంగా అభివృద్ధి చెందుతున్న విశాఖపట్నం కేంద్రంగా డ్రగ్స్, గంజాయి రవాణా జోరుగా సాగుతోంది. ప్రభుత్వ గణాంకాల ప్రకారం ఇతర రాష్ట్రాలకు రవాణా అవుతున్న మాదక ద్రవ్యాల్లో విశాఖ నుంచి 70 శాతానికిపైగా ఉన్నట్టు ఓ అంచనా. పోలీసులు, అధికారులు ఎన్ని చర్యలు చేపట్టినప్పటికీ రవాణాదారులు కొత్త కొత్త పంథాల్లో తమపని తాము చేసుకుపోతున్నారు. మరోపక్క నగర యువత అధిక సంఖ్యలో మత్తుకు బానిసలు అవుతున్నారు. విశాఖ నగరంలో పాన్ షాపుల్లో సైతం గంజాయి అమ్మకాలు కొనసాగుతుండడం తీవ్ర ఆందోళనకు గురిచేసే అంశం. దీనిపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

పోలీసుల దాడులు ఇలా..

అధికారుల గణాంకాల ప్రకారం ఈ ఏడాది జనవరిలో సిటీ పోలీసులు, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూ రో అధికారులు సంయుక్తంగా 388 కేసుల్లో 6459 కిలోల గంజాయిని గుర్తించి సీజ్ చేశారు. గంజాయిని రవాణా చేస్తున్న 852 మందిని అరెస్టు చేశారు. ఈ గంజాయి రవాణాకు ఒడిశా రాష్ట్రంలోని కోరాపుట్ ప్రధాన కేంద్రంగా ఉంది. అక్కడ నుంచి విశాఖ నగరం మీదుగా రవాణా అవుతున్న గంజాయినే 77 కేసుల్లో 4604 కిలోలుగా గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. మొత్తం స్వాధీనం చేసుకున్న 6459 కిలోల గంజాయిలో 71.3 శాతం విశాఖపట్నం కేంద్రంగా ఇతర రాష్ట్రాలకు రవాణా చేయబడుతోందని, స్వాధీనం చేసుకున్న మొత్తం 6459 కిలోల గంజాయిలో 71.3 శాతం ఇతర రాష్ట్రాలకు ప్రధానంగా ఉత్తరప్రదేశ్, తమిళనాడు, రాజస్థాన్. ఢిల్లీ. బీహార్. మధ్యప్రదేశ్, పశ్చిమ బెంగాల్, కర్ణాటక, తెలంగాణలకు రవాణా అవుతోందని అధికారులు గుర్తించారు. మరోపక్క సిటీ పోలీసులు, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు సంయుక్తంగా నిర్వహించిన దాడుల్లో 247 మంది ఇతర రాష్ట్ర డ్రగ్ పెడ్లర్లను అరెస్టు చేశారు. వారి నుంచి 5131 పెంటాజోసిన్ ఇంజెక్షన్ 1పిలను స్వాధీనం చేసుకున్నారు. 11.114 సేడెక్టివ్ మాత్రలు, 85 ఎల్‌ఎస్‌డి బ్లాట్‌లు, 2 కిలోల నల్లమందు, 126.2 గ్రాముల ఎండిఎంఎ మాదక ద్రవ్యాలను స్వాధీనం చేసుకున్నారు. ప్రధాన నిందితున్ని పశ్చిమ బంగాలో అరెస్టు చేశారు.

నియంత్రణ చర్యలు ఇలా..

నగరంలోని పోలీసు యంత్రాగం మాదక ద్రవ్యాల రవాణా, వినియోగాన్ని నివారించేందుకు ప్రభుత్వ స్థలాలు, విద్యా సంస్థల వద్ద 146 హోర్డింగ్‌లు ఏర్పాటు చేసింది. ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలలు, ముఖ్యమైన ప్రదేశాలు కలుపుకుని 176 పోస్టర్లు మిగతా 2లో..

స్వర్ణభారతి స్టేడియంలో ఏర్పాట్లును పరిశీలిస్తున్న సిద్ధార్థజైన్

ఓట్ల లెక్కింపు కేంద్రంలో పటిష్ట ఏర్పాట్లు

ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకులు సిద్ధార్థ జైన్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : వచ్చే నెల 16న నిర్వహించబోయే ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు సంబంధించి ఎటువంటి లోటుపాట్లూ జరగకుండా చూడాలని అధికారులను ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకులు సిద్ధార్థ్ జైన్ ఆదేశించారు. శనివారం సాయంత్రం స్థానిక స్వర్ణభారతి ఇండోర్ స్టేడియాన్ని ఆయన పరిశీలించారు. స్ట్రాంగ్ రూమ్‌లను, ఓట్ల లెక్కింపు కేంద్రాన్ని తనిఖీ చేశారు. రిసెప్షన్ కౌంటర్లను పరిశీలించారు. ఓట్ల లెక్కింపు సమయంలో చేపడుతున్న పనుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకుని, పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో రెవెన్యూ డివిజనల్ అధికారులు హుస్సేన్ సాహెబ్, భాస్కర్‌రెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

విశాఖ పోర్టులో సుధాన్ష్ పంత్ పర్యటన

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : కేంద్ర పోర్టులు, నౌక, జలరవాణా శాఖ కార్యదర్శి సుధాన్ష్ పంత్ శనివారం విశాఖపట్నం పోర్టును సందర్శించారు. ఈ సందర్భంగా పోర్టు పరిపాలనా భవనంలోని బోర్డు రూములో పోర్టులో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులపై పోర్టు ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. పిపిపి బెర్తుల కార్యకలాపాలు, సరుకు రవాణా, ఆర్థిక స్థితి, ఒఆర్ 1, 2 బెర్తుల సామర్థ్యం పెంపుదల, అవుటర్ హార్బర్‌లో క్రూయిజ్ టెర్మినల్ నిర్మాణం, బెర్తుల అభివృద్ధి, యాంత్రీకరణ, ఫ్లై ఓవర్ల నిర్మాణ పనులు, ట్రక్ పార్కింగ్ టెర్మినల్, కవర్డ్ స్టోరేజ్ షెడ్‌ల నిర్మాణం, రైల్వే ట్రాక్‌ల విద్యుదీకరణ, ఫిషింగ్ హార్బర్ అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ పనులు వంటి అంశాలపై ఆయన పోర్టు అధికారులతో సవివరంగా సమీక్షించారు. అనంతరం మిగతా 2లో..

పోర్టు ఆసుపత్రి, బెర్తుల ప్రైవేటీకరణ ఆపండి

వార్త 2లో..

వైసిపి నేత దాడిపై సచివాలయ ఉద్యోగుల నిరసన

వార్త 5లో..

పెయింటింగ్స్‌ను ఆసక్తిగా తిలకిస్తున్న మహిళలు

ఆకట్టుకున్న ఆర్ట్ ఎగ్జిబిషన్

ప్రజాశక్తి - కలెక్టరేట్ : దేశంలోని ప్రధాన నగరాల్లో ఒకటైన విశాఖపట్నంలో శాశ్వత ఆర్ట్స్ గ్యాలరీని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఈస్టర్న్ నావెల్ కమాండ్ వైస్ అడ్మిరల్ సంజయ్ వాత్సవన్ అన్నారు. ఆర్ట్ వర్క్స్ ఆధ్వర్యంలో బీచ్ రోడ్డులోని ఓ హోటల్లో రెండు రోజులపాటు తలపెట్టిన ఆర్ట్స్ ఎగ్జిబిషన్‌ను ఆయన శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కరోనా సమయంలో తప్ప కొన్నేళ్లుగా క్రమం తప్పకుండా ఆర్ట్ ఎగ్జిబిషన్ నిర్వహిస్తుండడం హర్షించదగిన విషయమన్నారు. విశాఖ నగరంలో పేరెన్నికగన్న మిగతా 2లో..

పోరాటాలతోనే పాత పెన్షన్ సాధించుకోగలం

మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ

సదస్సులో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ శర్మ

ప్రజాశక్తి - కలెక్టరేట్ : పోరాటాలతోనే పాత పెన్షన్‌ను సాధించుకోగలమని ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్ శర్మ అన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల, ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో శనివారం అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో 'పెన్షన్ ఉద్యోగుల జన్మహక్కు – దీనిని కాపాడుకోవడం ఎలా?' అనే అంశంపై జిల్లా స్థాయి సదస్సు జరిగింది. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ఉద్యోగంలో చేరినప్పటి నుంచి 30 – 40 ఏళ్ల పాటు ప్రజలకు అనేక రకాలుగా సేవలందిస్తూ ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగి జీవితాంతం, జీవించడం కోసం ఏనాటి నుంచో పెన్షన్ విధానాన్ని అమలు చేస్తున్నారన్నారు. ఇది రాజ్యాంగ ప్రకారం సంక్రమించిన హక్కు అని తెలిపారు. పెన్షన్ చెల్లించడం ప్రభుత్వానికి భారం కాదన్నారు. దాన్ని ఒక బాధ్యతగా గుర్తెరగాలన్నారు. పెన్షన్ హక్కును కాలరాసే విధంగా నూతన పెన్షన్ విధానం అంటూ ఉద్యోగులను మోసగించే చర్యలకు కేంద్ర ప్రభుత్వం పాల్పడటం శోచనీయమన్నారు. బ్యాంకుల నుంచి లక్షలాది కోట్ల రూపాయల రుణాలు పొంది ఎగవేస్తున్న వారి రుణాలను రద్దు చేస్తున్న ప్రభుత్వానికి ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగులకు ఇచ్చే పెన్షన్ భారం కాదన్నారు. ప్రభుత్వం అవలంబిస్తున్న తప్పుడు విధానాన్ని వ్యతిరేకిస్తూ అన్ని ప్రభుత్వ రంగ సంస్థల్లోని ఉద్యోగులూ ఐక్యంగా పోరాటం చేయకతప్పదన్నారు. పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభ మాట్లాడుతూ పెన్షన్ బిక్ష కాదు.. రాజ్యాంగ హక్కు అని అన్నారు. పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. 2004 తర్వాత ఉద్యోగంలో చేరిన వారికి పెన్షన్ లేదనడం సరికాదన్నారు. నూతన పెన్షన్ విధానం.. ఒక బూటకం అన్నారు. రాష్ట్రంలో జిపిఎస్ పేరుతో తీసుకువచ్చే పెన్షన్ విధానం ఉద్యోగులందరినీ మోసగించేదేనని అన్నారు. శాసన మండలికి తాను ఎన్నికైతే ఉద్యోగస్తులకు పాత పెన్షన్ విధానం అమలు కోసం పోరాటం చేస్తానని హామీ ఇచ్చారు. సభాధ్యక్షులు, ఐక్యవేదిక కన్వీనర్ రెడ్డి వెంకటరావు మాట్లాడుతూ పాత పెన్షన్ విధానం తప్పు అయితే, ఎమ్మెల్యేలు, ఎంపీలకు పాత పెన్షన్ విధానాన్ని ఎందుకు అమలు చేస్తున్నారని ప్రశ్నించారు. 40 ఏళ్ల మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

విశాఖ కేంద్రంగా మత్తు పదార్థాల రవాణా

అతికించారు. ఈ అవగాహన కార్యక్రమాల్లో భాగంగా ముఖ్యమైన ట్రాఫిక్ జంక్షన్ల వద్ద 56 చోట్ల బేనర్లు ఏర్పాటు చేశారు. విశ్వవిద్యాలయాలతో పాటు పలు విద్యాసంస్థల్లో 252 అవగాహన ప్రచార కార్యక్రమాలు నిర్వహించారు. ఇంజినీరింగ్ కళాశాలలు, ప్రభుత్వ, ప్రైవేట్ డిగ్రీ కళాశాలలు, పాఠశాలల విద్యార్థుల్లో డ్రగ్స్ వినియోగం - అనర్థాలపై అవగాహన కల్పించారు. సుప్రా వాహనంతో ఆడియో, వీడియో విజువల్స్ ప్లే చేయడం ద్వారా జిల్లా అంతటా ప్రచారం చేస్తున్నారు. విశాఖ నగరంలో 202 మంది డ్రగ్ వినియోగదారులను తొలి దశలో గుర్తించి కెజిహెచ్‌లో ఉన్న డ్రగ్ డి-అడిక్షన్ సెంటర్ల ద్వారా కౌన్సెలింగ్ ఇస్తున్నారు. సింథటిక్ డ్రగ్ కేసుల్లో నగరంలో 85 మంది డ్రగ్స్ అండ్ యూజర్లను గుర్తించి కౌన్సెలింగ్ ఇచ్చి డీ అడిక్షన్ సెంటర్‌కు తరలించారు.

పోరాటాలతోనే పాత పెన్షన్ సాధించుకోగలం

పాటు పనిచేసే ఉద్యోగులకు లేని ఇటువంటి హక్కు, ఐదేళ్ల పదవి కోసం ఎంపికయ్యే ఎమ్మెల్యేలు, ఎంపీలకు ఎందుకని అడిగారు. పాత పెన్షన్ విధానాన్ని సాధించడం కోసం దేశవ్యాప్తంగా ఉద్యమం ప్రారంభమైందని చెప్పారు. అందులో భాగంగా అన్ని జిల్లాల్లో ఐక్య వేదిక ఆధ్వర్యంలో సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆదివారం విజయవాడలో ఓ సదస్సు జరుగుతుందని, మార్చి 26న విశాఖపట్నంలో ప్రాంతీయ సదస్సు నిర్వహిస్తామని తెలిపారు. సదస్సులో ఎల్ఐసి ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి జి.వరప్రసాద్, తపాలా ఉద్యోగుల సంఘం నాయకులు గణేష్, ఎన్‌సిఇ యూనియన్ ప్రధాన కార్యదర్శి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ఆర్ట్ ఎగ్జిబిషన్

అనేకమంది చిత్రకారులు ఉన్నారన్నారు. అటువంటి వారిని ప్రోత్సహించడం కోసం శాశ్వత పద్ధతిలో ఆర్ట్స్ గ్యాలరీ ఉండాల్సిన అవసరం ఉందన్నారు. ప్రముఖ ఆర్ట్ టీచర్ జుమానా మాట్లాడుతూ విశాఖ నగరంలో ఇది 16వ ఆర్ట్స్ ఎగ్జిబిషన్ అన్నారు. ఇక్కడ పెయింటింగ్స్ ప్రదర్శనతో పాటు అమ్మకాలు కూడా జరుగుతాయన్నారు. ప్రస్తుతం ఇక్కడ ఏర్పాటుచేసిన 180 పెయింటింగ్స్‌ను 22 మంది చిత్రకారులు వేశారన్నారు. చిత్రకళను అభివృద్ధి చేయడం కోసం, చిత్రకారులను ప్రోత్సహించడం కోసం ఇటువంటి ప్రదర్శనలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అమ్మకానికి పెట్టిన పెయింటింగ్స్‌లో రూ.2 వేలు నుంచి రూ.90 వేల ధర పలికేవీ ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ప్రముఖ చిత్రకారులు డాక్టర్ సల్మా మెహిదీ, నిరుపమ తదితరులు పాల్గొన్నారు.

పోర్టు అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న సుధాన్ష్ పంత్

విశాఖ పోర్టులో సుధాన్ష్ పంత్ పర్యటన

పోర్టులో జరుగుతున్న కార్యకలాపాలను పోర్టు చైర్మన్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. సరుకు రవాణాను మరింత పెంచేందుకు సరైన ప్రణాళికతో ముందుకు వెళ్లాలని సుధాన్ష్ పంత్ సూచించారు. కార్యక్రమంలో పోర్టు చైర్మన్ కె.రామ్మోహన్‌రావు, పోర్టు డిప్యూటీ చైర్మన్ దుర్గేష్ కుమార్ దుబే, పోర్టు కార్యదర్శి టి.వేణుగోపాల్ పాల్గొన్నారు. అనంతరం పిపిపి, బిఒటి ఆపరేటర్లతో సుధాన్ష్ పంత్ సమీక్ష నిర్వహించారు. వారి ఆలోచన విధానాన్ని ప్రశంసించారు. పోర్టు యూనియన్ నేతలు, వివిధ ఉద్యోగ సంఘాల ప్రతినిధులు ఆయనకు వినతిపత్రాలు అందజేశారు.

డిసిఐలో సందర్శన

సుధాన్ష్ పంత్ డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్‌ను సందర్శించారు. సంస్థ ఆవరణలో మొక్కలు నాటారు. కంపెనీ డ్రెడ్జింగ్ సామర్థ్యాన్ని పెంచాల్సిన అవసరముందన్నారు.

చెస్ పోటీలకు ఎంపికలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఆల్ విశాఖ చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం అండర్ - 9 ఓపెన్, గర్ల్స్ సెలక్షన్ పోటీలకు ఎంపికలు జరిగాయి. 32 మంది పాల్గొన్నారు. బాలుర విభాగంలో కార్తికేయ అద్దంకి, కోనాడ జయంత్, బాలికల విభాగంలో పొట్నూరు సాత్విక, కమల ప్రియ ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారు. వీరు స్టేట్ అండర్-9 పోటీలకు విశాఖ జిల్లా నుంచి ప్రాతినిథ్యం వహిస్తారని అసోసియేషన్ సభ్యులు మణికంఠ, శ్రీకాంత్, బాబూరావు, ఉమామహేశ్వరరావు తెలిపారు.

పలాయనం చిత్తగించలేదా ?

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

'విచక్షణ లేని వీరత్వం వన్నెకెక్కదు.. నీ విచక్షణే నీకు ఉపాధ్యాయుడు (బోధకుడు)గా ఉండాలి. మాటకీ చేతకీ - చేతకీ మాటకీ పొంతన ఉండేటట్టు చూసుకో' అంటూ ప్రబోధిస్తాడు ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన రచయిత షేక్స్పియర్. ఈ మాటలు అక్షరాలా విశాఖలోని ఓ ప్రబుద్ధునికి వర్తించవా ? అన్నదే ఇక్కడ పలువురినీ కలచివేస్తోంది. భారత రాజ్యాంగాన్ని అమలు పరచాల్సిన స్థానంలో ఉండి అధికార పార్టీ అడుగులకు మడుగులొత్తుతూ రాజ్యాంగ మూలాలకు మచ్చ తెచ్చేలాగ ఎన్నికల నియమావళిని ఉల్లంఘించిన ఘనుడాయన. ఇప్పటికే ఆయనెవరన్నది పై వ్యాఖ్యలు చదివిన ఎవ్వరికైనా అర్థమయ్యే ఉంటుంది. ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలతో ప్రైవేట్ హోటల్‌లో సమావేశం జరిపి..కన్నంలో తేలుకుట్టిన దొంగలా దొరికేసి.. ప్రజాసంఘాల ఆగమనం తరువాత దొడ్డిదారిన సదరు వ్యక్తి పలాయనం చిత్తగించిన వైనం.. ఇత్యాది విషయాలన్నీ చదివాక మరింత క్లారిటీ వచ్చేసినట్టే కదా.

విచారణ చూస్తే కలుగదా విచారం ?

ఆ తర్వాత జరిగిన కథ ఏమిటని చూస్తే... విచారణ తంతు. ఎవరిపై ఎవరు విచారణ వేసుకున్నారు ? అన్నదే ఇక్కడ గుర్తించదగ్గ విషయం. అధికార పార్టీకి వత్తాసు పలుకుతున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆంధ్రా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్‌పై అధికార పార్టీ కనుసైగల్లో నడిచే ఓ రెవెన్యూ అధికారిచేత ఈ తూతూ మంత్రాంగాన్ని జిల్లా అధికార యంత్రాంగం నడిపింది. అంటే 'ఎవరు చేసిన తప్పుపై వారే సొంతంగా విచారణ వేసుకున్నట్టుంది ఈ వ్యవహారం'. తన తప్పు తానెరుగుదురా ? ఇదీ అంతే. ఎయు విసి నిబంధనలకు విరుద్ధంగా పూర్వ రిజిస్ట్రార్‌ను సైతం వెంటబెట్టుకొచ్చి అధికార పార్టీకి చెందిన ఎమ్మెల్సీ అభ్యర్థికి అనుకూలంగా ఈ నెల 19న భేటీ నడపాలని చేసిన ప్రయత్నాలను

ప్రజాసంఘాలు చెల్లాచెదురు చేసి యావత్ రాష్ట్రానికి పట్టిచూపడంతో జిల్లా అధికార యంత్రాంగమే కాదు, యావత్ రాష్ట్ర ప్రభుత్వమే ఇరకాటంలో పడింది. ఆర్‌డిఒ నివేదిక చూస్తే ఆ రోజు జరిగిన అసలు విషయాలేమీ లేవు. అస్సలేం అక్కడ జరగలేదు. విసి ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించారనేందుకు నిర్దిష్టమైన ఆధారాలేమీ లేవనే సారాంశాన్ని బయటపెట్టాలనే ప్రయత్నాలు కనిపిస్తున్నాయి.

అతిక్రమణలకు జరిమానా తప్పదు

ఎమ్మెల్సీ ఎన్నికల్లో తమ పార్టీ ఎలాగైనా గెలవాలనే తాపత్రయం ఈ మొత్తం వ్యవహారాన్ని పట్టిచూపుతోంది. పైపెచ్చు సదరు విసి ఆ తర్వాత మీడియాతో మాట్లాడుతూ ముఖ్యమైన వ్యక్తులు అక్కడకు రావడంతో తాను వారిని కలిసేందుకు వెళ్లానని చెప్పడం చూస్తే ఎంత అడ్డగోలుతనమో అర్థమవుతుంది. ఏ విషయంలోనైనా ఎయు జోక్యం ఉంటుందన్న సంకేతాలను అందించడమే గాక...ఇక్కడ అన్ని రిపేర్లూ చేయబడతాయి అనే స్టేట్‌మెంట్ ఇవ్వడం చూస్తే అధికార దుర్వినియోగం ఎంతో అర్థమవుతోంది. విశాఖలోనే కాదు రాష్ట్రంలో ఎన్నికల నిబంధనలను అమలు చేయడంలో ఎన్నికల సంఘం ఎలా చేతులు ముడుచుకుని కూర్చొంటుందో అనేక ఉదంతాలు పత్రికల్లో పతాక శీర్షికల్లో వస్తూనే ఉన్నాయి. ఎయు విసి ప్రసాద్‌రెడ్డి ఎన్నికల కోడ్ ఉల్లంఘనపై స్వతంత్ర దర్యాప్తు జరిపించాలన్న డిమాండ్ అన్ని రాజకీయ పార్టీల నుంచీ తాజాగా వినిపిస్తోంది. ఒక్కమాటలో చెప్పాలంటే ఇదో ఉద్యమంగా కూడా ప్రజ్వరిల్లే అవకాశాలు లేకపోలేదు. రాష్ట్ర ప్రభుత్వం, వైసిపి పాలకుల నిర్వాకాలు అన్నీ ఇన్నీ కావు. ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ మరిన్ని అక్రమాలకు పాల్పడే అవకాశాలూ కళ్లముందు దర్శనమిస్తున్నాయి. ప్రజా బాహుళ్యమే వీటన్నిటికీ మార్చి 13న ఓటు ద్వారా సమాధానం చెప్పే అవకాశముంది.

పోర్టు ఆసుపత్రి, బెర్తుల ప్రైవేటీకరణ ఆపండి

పోర్టు గేటు వద్ద ధర్నా నిర్వహిస్తున్న నాయకులు

పోర్టు గేటు వద్ద కార్మికుల ధర్నా

ప్రజాశక్తి - కలెక్టరేట్ : పోర్టు ఆసుపత్రి, బెర్తుల ప్రైవేటీకరణను నిలుపుదల చేస్తూ షిప్పింగ్ సెక్రటరీ ప్రకటన చేయాలని యునైటెడ్ పోర్టు అండ్ డాక్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) కార్యదర్శి బి.జగన్ డిమాండ్ చేశారు. షిప్పింగ్ సెక్రటరీ శనివారం విశాఖపట్నం పర్యటనకు వచ్చిన సందర్భంగా పోర్టు గేటు వద్ద యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ ఇదివరకూ షిప్పింగ్ సెక్రటరీ పర్యటనకు వచ్చిన రెండు సార్లూ నాలుగు పోర్టు బెర్తులను ప్రైవేటీకరణ చేశారన్నారు. ఐఒసిని అదానీ పోర్టుకు అప్పజెప్పడం తాజా పర్యటన ముఖ్య ఉద్దేశంగా ఉందన్నారు. పోర్టు ఆస్తులైన బెర్తులు, హాస్పిటల్, పోర్టు కళావాణి, కళ్యాణ మండపం తదితర వాటికి టెండర్లు పిలిచినా ఎవరూ రాకపోవడంతో ఎలా అయినా పోర్టు ఆస్తులను ప్రైవేటీకరణ చేయాలని సర్వే చేయడానికి షిప్పింగ్ సెక్రటరీ వచ్చారన్నారు. రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమల్లో ఉంటే ఏ రకంగా పర్యటనకు వచ్చి అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగిస్తారని ప్రశ్నించారు. ఇప్పటికైనా షిప్పింగ్ సెక్రటరీ పోర్టు ఆస్తులు, బెర్తులు, హాస్పటల్, కళ్యాణ మండపాలను ప్రైవేటీకరణ చేయడం లేదని, ఐఒసిని అదానీ గంగవరం పోర్టుకు ఇవ్వబోమని ప్రకటన చేయాలన్నారు. లేనిపక్షంలో మిగతా కార్మిక సంఘాలు, రాజకీయ పార్టీలను కలుపుకొని స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ పోరాటం తరహా ఉద్యమం కొనసాగిస్తామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎటువంటి నిరసనలూ తెలపకుండా గొంతు నొక్కే పరిస్థితి నేడు ఏర్పడిందన్నారు. విశాఖ పోర్టు ఆదాయం తగ్గించి, అదానీ ఆదాయాన్ని పెంచడానికి గంగవరం పోర్టుకు ఇండియన్ ఆయిల్ కంపెనీ టెండర్లు ఇవ్వడానికి చూస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు వివిఎస్.పద్మనాభరాజు, లక్ష్మణరావు, జక్కన్న, సత్యనారాయణ, రామలింగేశ్వరరావు, ఎల్లారావు, నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

ఎయు విసి అక్రమాలపై ఐక్య ఉద్యమం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఎయు విసి ప్రసాద్ రెడ్డి వర్సిటీలో అవలంబిస్తున్న నియంతృత్వ విధానాలకు వ్యతిరేకంగా మార్చి మొదటి వారం నుంచి ఉత్తరాంధ్ర జిల్లాల్లో కలిసి వచ్చే వివిధ విద్యార్థి, యువజన, అభ్యుదయ సంఘాలను కలుపుకుని ఐక్యంగా ఉద్యమాన్ని ఉధతం చేస్తామని ఆంధ్రా యూనివర్సిటీ ప్రోగ్రెసివ్ ఫోరమ్ కన్వీనర్ డాక్టర్ పొన్నాడ శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రస్తుతం నగరంలోని విద్యావంతులను, మేధావులను, ప్రజాప్రతినిధులను, ప్రముఖులను కలిసి ప్రసాద్‌రెడ్డి దుర్మార్గాలను వివరిస్తున్నామని తెలిపారు.

విసి రాజీనామా చేసి రాజకీయాల్లోకి రావాలి

కలెక్టరేట్ : ఎయు విసి ప్రసాద్ రెడ్డి ఈ నెల 19న దసపల్లా హోటల్‌లో వైసిపి ఎమ్మెల్సీ అభ్యర్థికి మద్దతుగా సమావేశం ఏర్పాటు చేయడం యదార్థమని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎమ్.డి.నజీర్ అన్నారు. శనివారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్ని రకాల ఆధారాలు ఉన్నప్పటికీ ప్రసాద్ రెడ్డి అక్కడ లేరని చెప్పే విధంగా తప్పుడు నివేదికను విశాఖ ఆర్‌డిఒ రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు నివేదిక పంపడం దుర్మార్గమన్నారు. అంతగా రాజకీయాల పట్ల ఆసక్తి ఉంటే విసి తక్షణం తన పదవికి రాజీనామా చేసి రాజకీయాల్లోకి రావాలన్నారు.

మహారాజశ్రీ విజయనగరం మోటారు ఏక్సిడెంట్ క్లెయిమ్స్ ట్రిబ్యునల్ మరియు 1వ అదనపు జిల్లా జడ్జివారి కోర్టు విజయనగరం
ఎం.వి.ఓ.పి.నెం. 156/2022

బిట్వీన్ : **బమ్మిడి రామసత్యం** ...పిటిషనర్
మరియు: **నిద్రబంగి మహాలక్ష్మణ్ మరియు ఇతరులు** ...రెస్పాండెంట్స్

2వ రెస్పాండెంట్ వివరం:
జె. గురుమూర్తి, తండ్రి/రాము, రెసిడెంట్ ఆఫ్ డోర్. నెం. 4-74, జీరుపేట, ఓనర్ ఆఫ్ ది ఆటోరిక్షా, బేరింగ్ నెం. **AP31TH4795**, భీమిలి, విశాఖపట్నం.

నోటీసు

పై నెంబరు కేసులో పిటిషనరు రెస్పాండెంట్స్ ఇన్సూరెన్స్ నష్టపరిహారం ఇప్పించవలసినదిగా కోర్టులో దాఖలు చేసిన కేసులో 2వ రెస్పాండెంటుకు నోటీసు అమలు జరగనందున ఈ పత్రికా ప్రకటన ద్వారా రెండవ రెస్పాండెంటు కేసు వాయిదా నిమిత్తం కోర్టు వారి ఆదేశాల మేరకు ఈ పత్రికా ప్రకటన వేయబడినది.సదరు కేసు **తేది 01.03.2023న** వాయిదా అయి ఉన్నది. కావున 2వ రెస్పాం డెంట్ అయిన **జె. గురుమూర్తి** స్వయముగా గాని, వారి తరపున న్యాయవాది ద్వారా గాని పై తేదిన **ఉదయం 10.30 ని॥** లకు పైన పేర్కొనబడిన కోర్టులో హాజరు కావలసి యున్నది. లేని యెడల యెడల కోర్టువారు పైన పేర్కొనబడిన 2వ రెస్పాండెంట్ పరోక్షముగా నిర్ణయం తీసుకొనబడును.

కరణం సూర్యతేజ్
పిటిషనరు తరపు న్యాయవాది,
తోటపాలెం,విజయనగరం.
ఫోన్:9440108023

IN THE HONOURABLE COURT OF THE SENIOR CIVIL JUDGE AT VIZIANAGARAM
EP NO.. 23/2021 IN 0.S. NO.61/2018

Between : **Mohammed yousuf** --Decree Holder
And: **Nusrat Shabana** --Judgment Debtor

COURT NOTICE

Judgment debtor: **Nusrat Shabana** W/o shaik Ahamadullah Dr. No 37-10-148/3, Ayyappanagaram Murali Nagar, Visakha patnam.

పై నెంబరు **E.P.**లో మీ యొక్క హాజరు నిమిత్తం పై కోర్టు వారు పలుమార్లు మీకు కోర్టు ద్వారాను మరియు **Registered Post** ద్వారాను కోర్టుకి హాజరుకమ్మని జారి చేసినారు, అయినప్పటికీ మీరు వాటిని ఉద్దేశ పూర్వకంగాను తీసుకొన లేదు మరియు కోర్టుకి హాజరు కాలేదు. అందుకు గాను గౌరవపై కోర్టు న్యాయధికారి వారు ఈ ప్రకటన మూలంగా మీ హాజరు నిమిత్తము **తేదీ : 10-03-2023 దిన** పైన తెలిపిన కోర్టులో హాజరు కొరకు అదే చించియున్నారు, కావున మీరు తేది **10-03-2023 దిన ఉదయం గం॥ 10-30 ని॥లకు** మీరు గాని మీ ప్లీడర్ గారు ద్వారా గాని హాజరు కావలసిందిగా ఈ ప్రకటన మూలంగా తెలియజేయడం జరిగింది. అట్లు మీరు కోర్టుకి హాజరుకాని పక్షంలో మీ పై పరోక్షంగా శ్రీ కోర్టు వారు చర్య తీసుకుందురని తెలియ జేయడమైనది.

A. HARISH,
R. RAMAKRISHNA
Advocates, Vizinagaram
ph: 9490682844, 7013573135

పరీక్షలంటే భయం వద్దు!

అవగాహన కల్పిస్తున్న వ్యక్తిత్వ వికాస నిపుణులు సతీష్

ప్రజాశక్తి -గాజువాక : పరీక్షలంటే భయం, అవగాహన లోపమే ఫెయిల్యూర్‌కు కారణమౌతుందని ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు సతీష్ మాకేనా అన్నారు. శనివారం గాజువాక పారిశ్రామిక ప్రాంత ప్రైవేటు పాఠశాలల సమాఖ్య (జిప్సా) ఆధ్వర్యంలో సాయిగణపతి పాలిటెక్నిక్ కాలేజీ సౌజన్యంతో వివిధ పాఠశాలల 10వ తరగతి విద్యార్థులు పరీక్షల్లో ఉత్తీర్ణత ఎలా సాధించాలో అన్నదానిపై మోటివేషనల్ తరగతులను, అవగాహన కల్పించారు. అనంతరం మ్యాథ్స్, ఫిజికల్ సైన్స్, నాచురల్ సైన్స్, సోషల్ వంటి సబ్జెక్టుల్లో విద్యార్థులకు ప్రత్యేక శిక్షణను డిప్యూటీ డిఇఒ గౌరీ శంకరరావు అందించారు. ఈ సందర్భంగా డిప్యూటీ డిఇఒ గౌరీ శంకరరావు మాట్లాడుతూ మారిన నూతన పరీక్షా విధానంపై అవగాహన కలిగి, ఎటువంటి భయాందోళనలకు గురికాకుండా ఆత్మస్థైర్యంతో పరీక్షలు రాయాలని సూచించారు. కార్యక్రమంలో జిప్సా కార్యదర్శి బి.శ్రీనివాస్, కోశాధికారి డి.శ్రీనివాస్, రాము, మురళి, జగన్, బాబురావు సుమారు 50 ప్రైవేటు పాఠశాలల ప్రతినిధులు, దాదాపు వెయ్యి మంది విద్యార్థులు పాల్గొన్నారు. .

27న పోర్టు పెన్షనర్ల ధర్నా

కరపత్రాలను పంచుతున్న అసోసియేషన్ సభ్యులు

ప్రజాశక్తి మాధవధార : విశాఖపట్నం పోర్ట్‌ట్రస్ట్‌పై కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా విశాఖపట్నం హార్బర్ అండ్ పోర్ట్ పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 27న, సోమవారం గోల్డెన్ జూబ్లీ హాస్పిటల్ వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ ఛైర్మన్ సనపల బంగారురాజు, అధ్యక్షులు చౌదరి అప్పారావు తెలిపారు. ధర్నాలో హార్బర్ అండ్ పోర్ట్ పెన్షనర్లందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ మేరకు శనివారం మురళీనగర్, మాధవధార, కళింగనగర్, తెన్నేటి నగర్ తదితర ప్రాంతాల్లోని పెన్షనర్లను కలిసి, ధర్నాలో పాల్గొని జయప్రదం చేయాలని కోరుతూ కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి పిఎస్ ప్రకాశరావు, కోశాధికారి అన్నపు నారాయణరావు, కె.గణేష్, పి.రామారావు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు సాయం

బాధితులకు సాయం అందిస్తున్న టిడిపి నేత గురునాథ్

ప్రజాశక్తి - పిఎం.పాలెం: పిఎం పాలెం, ఆర్‌హెచ్ కాలనీ సమీ పంలో తాటాకిల్లు దగ్ధ మైన ఘటనలో సర్వం కోల్పోయిన అగ్ని ప్రమాద బాధిత కుటుంబానికి కెవిఆర్ కేటరింగ్ అధినేత, టిడిపి పార్లమెంటరీ నియోజకవర్గ తెలుగు యువత కార్యదర్శి గరె గురునాథ్ శనివారం సాయంత్రం నిత్యావసర వస్తువులు అందజేశారు. టిడిపి అధికారంలో ఉన్నా లేకున్నా, ఆపదలో ఉన్నవారికి ఆ పార్టీ నేతలుగా తమ అండ ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. కార్యక్రమంలో టిడిపి ఆరో వార్డు బిసిసెల్ అధ్యక్షుడు రెడ్డి సత్యనారాయణ, తెలుగు మహిళ అధ్యక్షురాలు బబ్బిలి పాల్గొన్నారు.

మోసపూరిత జిఒలపై

అఖిలపక్ష చర్చకు సిద్ధమా?

టిడిపి జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు

మాట్లాడుతున్న టిడిపి నేత పల్లా శ్రీనివాసరావు

ప్రజాశక్తి-గాజువాక : గాజువాక భూసమస్య పరిష్కారానికి ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డికి చిత్తశుద్ధి ఉంటే జిల్లా ఉన్నతాధికారుల సమక్షంలో వైసిపి ప్రభుత్వం జారీ చేసిన మోసపూరిత జిఒలు 60,71లపై అఖిలపక్ష సమావేశం నిర్వహించి చర్చకు రావాలని విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గ టిడిపి అధ్యక్షులు, గాజువాక మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు డిమాండ్ చేశారు శనివారం పాత గాజువాక తెలుగుదేశం కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా రాజశేఖర్ జారీ చేసిన జిఒ44ను గౌరవించిన తర్వాత సిఎం చంద్రబాబు, దాన్ని రిజిస్ట్రేషన్, ప్లాన్ అప్రూవల్స్‌కు సంబంధిత శాఖలకు పంపిందన్నారు. గాజువాక ప్రజల పట్ల వైసిపి ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే జిఒ 301పై ఎలాంటి ఆంక్షలు పెట్టకుండా యథాతథంగా అమలు చేయాలన్నారు.జిఒ 60 ప్రకారం కొత్తగా దరఖాస్తు చేసుకునే వారికి లక్షలాది రూపాయలు భారం తప్పదన్నారు. సమస్య పరిష్కారంలో కాలయాపన చేయాలనే దురుద్దేశ్యంతోనే జిఒ 71 తెరపైకి తెచ్చి, దాదాపు 7500 మంది జిఒ 301 పట్టాదారులను కార్యాలయాలు, బ్రోకర్లు చుట్టూ ప్రదక్షిణలు చేసే దుస్థితి వైసిపి ప్రభుత్వం కల్పించిందని మండిపడ్డారు.

రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే జిఒ 44, లేదంటే జిఒ 301 ప్రకారం క్రమబద్ధీకరణకు వెసులుబాటు కల్పించాలని డిమాండ్ చేశారు. దీనిపై ఎమ్మెల్యే నాగిరెడ్డికి చిత్తశుద్ధి ఉంటే జిల్లా అధికారుల సమక్షంలో అఖిలపక్ష సమావేశం నిర్వహిస్తే, జిఒల్లోని లోపాలను ప్రభుత్వానికి తెలియపరుస్తామన్నారు. కార్యక్రమంలో గాజువాక నియోజకవర్గం ప్రసాదుల శ్రీనివాస్, జివిఎంసి డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ గంధం శ్రీనివాసరావు, 67వ కార్పొరేటర్ పల్లా శ్రీనివాసరావు, మాజీ కార్పొరేటర్ మహమ్మద్ రఫీ, తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి మొల్లివెంటి రాజు, బిసి సెల్ జిల్లా అధ్యక్షులు తమ్మిన విజయ్‌కుమార్, నేతలు చెరుకూరు నాగేశ్వరరావు, గాజువాక నియోజవర్గ అధ్యక్షులు బలగ బాలు నాయుడు, పార్టీ జిల్లా కార్యదర్శి గోమాడ వాసు, 75వ వార్డు అధ్యక్షులు నమ్మి అప్పారావు, 65వ వార్డు ప్రధాన కార్యదర్శి కదిరి పోలరాజు పాల్గొన్నారు.

విమ్స్ సిబ్బందికి హెపటైటిస్‘బి’ వ్యాక్సినేషన్

ప్రజాశక్తి -ఆరిలోవ : విశాఖ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ (విమ్స్) వైద్య సిబ్బందికి హెపటైటిస్ ‘బి’ వ్యాక్సినేషన్ ప్రత్యేక డ్రైవ్ శనివారం విజయవంతంగా నిర్వహించారు. వ్యాక్సినేషన్ డ్రైవ్‌ను ప్రారంభించిన విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు మాట్లాడుతూ, ఆసుపత్రికి వివిధ రకాల రోగులు వస్తున్న నేపథ్యంలో సిబ్బందికి హెపటైటిస్ బి వైరస్ సోకకుండా రక్షణకు వ్యాక్సినేషన్ చేయిస్తున్నామన్నారు.

కెజిహెచ్ గ్యాస్ట్రోఎంటరాలజీ విభాగం సహకారంతో ఆసుపత్రిలోని సుమారు నాలుగు వందల మంది సిబ్బందికి వ్యాక్సినేషన్ చేశామన్నారు. కార్యక్రమంలో కెజిహెచ్ గ్యాస్ట్రోఎంటరాలజీ విభాగాధిపతి డాక్టర్ గిరినాథ్, విమ్స్ ఆర్ఎంఒ డాక్టర్ హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విమ్స్ సిబ్బందికి వ్యాక్సిన్ వేస్తున్న తోటి సిబ్బంది

పరీక్ష విధానం, మూల్యాంకనంపై శిక్షణ

ధ్రువీకరణ పత్రం స్వీకరిస్తున్న ప్రసాదరావు

ప్రజాశక్తి -భీమునిపట్నం : మైసూరులోని భారతీయ శిక్షణ సంస్థాన్, సిబిఎస్ఇ ప్రధాన కార్యాలయంలో పరీక్ష మూల్యాంకనం, ఐటమ్ రైటింగ్ తదితర అంశాలపై ఈ నెల 21 నుంచి 24 వరకు శిక్షణనిచ్చారని మండలంలోని తాటితూరు హిందీ ఉపాధ్యాయులు టిఎస్‌వి ప్రసాదరావు శనివారం తెలిపారు.

వర్క్‌షాప్‌లో ప్రస్తుతం అమలవుతున్న సిబిఐ ఫార్మేటివ్, సమ్మెటివ్ అసెస్మెంట్ తదితర అంశాలపై విస్తృత చర్చ జరిగిందన్నారు. ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఏడాదిలో ఎన్నిసార్లు పరీక్షలు నిర్వహించాలి? ప్రశ్నాపత్రంలో ఉన్న వాటిని కామెటెన్సీల వారీగా ఏవిధంగా తయారుచేయాలి? అనే అంశంపై చర్చ జరిగిందని తెలిపారు.ఈ వర్క్‌షాప్‌కు ఎపి నుంచి ఇద్దరిని ఎంపిక చేయగా, అందులో తానుండడం అదృష్టంగా భావిస్తున్నానని ప్రసాదరావు తెలిపారు.

‘సృజన’లో చిన్నారుల టాలెంట్ షో

ప్రజాశక్తి -పిఎంపాలెం : చిరుప్రాయంలోనే పిల్లల్లోని సృజనాత్మకను గుర్తించి, వాటిని వెలికితీయాలని సృజన స్కూల్ డైరెక్టర్ మొహమ్మద్ షరీఫ్ అన్నారు. జివిఎంసి, ఆరో వార్డు, పిఎం పాలెం చివరి బస్‌స్టాప్ వద్ద గల సృజన స్కూల్‌లో శనివారం చిన్నారి విద్యార్థుల టాలెంట్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా షరీఫ్ మాట్లాడుతూ ఇలాంటి టాలెంట్ షోల ద్వారా పిల్లల్లో దాగిఉన్న టాలెంట్ వెలుగులోకి వస్తుందన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అనంతరం వివిధ పోటీలలో విజేతలకు, ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం నాగమణి పాల్గొన్నారు.

ప్రతిభచూపిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు

నేరాలు ఘోరాలు

రౌడీషీటర్ ఆత్మహత్య

పోలీసుల వేధింపులే కారణమంటున్న బంధువులు

మృతుడు శ్యామ్ (ఫైల్‌ఫొటో)

ప్రజాశక్తి -కంచరపాలెం: 55వ వార్డు తిక్కవానిపాలెం వాడపేటకు చెందిన రౌడీ షీటర్ ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన స్థానికంగా కలకలం రేపింది. పోలీసుల వేధింపు వల్లే ఆత్మహత్యకు పాల్పడినట్లు బంధువులు ఆరోపిస్తున్నారు. సంఘటనకు సంబంధించి కంచరపాలెం పోలీసులు తెలిపిన వివరాలివి.

కంచరపాలెం సమీపంలోని తిక్కవానిపాలెం, వాడపేటకు చెందిన తిక్కాడ శ్యామ్(31) శనివారం ఉదయం 9 గంటల సమయంలో ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న స్థానిక పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టానికి కెజిహెచ్ మార్చురీకి తరలించారు.

ఇదిలా ఉండగా పోలీసులు తప్పుడు కేసులు పెట్టడం వల్లే శ్యామ్ మృతి చెందాడని ఆయన బంధువులు ఆరోపిస్తున్నారు. 2018లో శ్యామ్‌పై దొంగతనం కేసు నమోదు కాగా, 2022లో హత్యాయత్నం కేసు ఉంది. 2022 డిసెంబర్‌లో గంజాయి కేసులో అరెస్టయిన శ్యామ్ జైలుకు వెళ్లాడు. ఇటీవలే బెయిల్‌పై వచ్చిన శ్యామ్‌కు కోర్టు నుంచి మళ్లీ వారెంట్ రావడంతో మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని స్థానికులు భావిస్తున్నారు. సిఐ విజయ్‌కుమార్ నేతృత్వంలో కంచరపాలెం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభుత్వం దృష్టికి రైతన్నల సమస్యలు



అప్పలనాయుడును సత్కరిస్తున్న ఎంపిపి రాంబాబు

ప్రజాశక్తి -పద్మనాభం: జిల్లా వ్యాప్తంగా రైతు సమస్యలను గుర్తించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని వైసిపి రైతు విభాగం విశాఖ జిల్లా అధ్యక్షులు మకర అప్పలనాయుడు అన్నారు. తన సేవలను స్థానిక ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు గుర్తించి, రైతు విభాగం జిల్లా అధ్యక్ష పదవిని అప్పగించి, బాధ్యతలనుమరింత పెంచారన్నారు.తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నెరవేరుస్తానన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.కాగా వైసిపి రైతు విభాగం జిల్లా అధ్యక్షునిగా నియమితుడైన అప్పలనాయుడును శనివారం పద్మనాభం జంక్షన్‌లోని వైసిపి కార్యాలయంలో స్థానిక ఎంపిపి కె.రాంబాబు సత్కరించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు టి పద్మనాభస్వామి, నరసింహనాయుడు, రేవిడి ఎంపిటిసి సూరప్పడు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శన

ప్రజాశక్తి- గాజువాక:చిన్నారుల్లో దాగివున్న సృజనాత్మకతను వెలికితీసి వారి భవిష్యత్తుకు బంగారు బాట వేయడానికి వైజ్ఞానిక ప్రదర్శనలు దోహదపడతాయని 65వ వార్డు కార్పొరేటర్ బొడ్డు నరసింహపాత్రుడు అన్నారు. శనివారం గాజువాక బిసి రోడ్డు, రాజీవ్ మార్గ్‌లోని విజ్ఞాన్ హైస్కూలులో నిర్వహించిన వైజ్ఞానిక ప్రదర్శనను జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ చిన్న వయసులోనే అనేక అంశాలపై ఆసక్తి కనబరిచేలా పిల్లలను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల కృషి చాలా గొప్పదన్నారు. వాతావరణ పరిస్థితులు, కాలుష్యం, తాగునీరు, విద్యుత్, వాహన రంగాలకు సంబంధించి వివిధ నమూనాలతో విద్యార్థుల ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డివి రమణి, కరస్పాండెంట్ టివిఎల్ సౌజన్య, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు

డాక్‌యార్డు వంతెన సమస్యపై

కలెక్టర్‌ జోక్యం చేసుకోవాలి

పాదయాత్రలో సిపిఎం నేతలు

పాదయాత్ర చేస్తున్న సిపిఎం నేతలు

ప్రజాశక్తి -ములగాడ : డాక్‌యార్డు బ్రిడ్జిపై 15నెలల పాటు రాకపోకలను నిషేధించాలన్న నేవల్‌ అధికారులతో జిల్లా కలెక్టర్‌ చర్చలు జరిపి, రాకపోకలు యథావిధిగా సాగేలా చర్యలు చేపట్టాలని సిపిఎం నేతలు కోరారు. జివిఎంసి 58వ వార్డు ఉప్పరకాలనీ, అంజతాకాలనీ కోడిపందెల దిబ్బ, గుల్లలపాలెం, 61వ వార్డు మల్కాపురం, వెంకన్నపాలెం, రామకృష్ణాపురం ప్రాంతాల్లో సిపిఎం బృందం పాదయాత్రలు నిర్వహించారు. సిపియం జోన్‌ కార్యదర్శి పి.పైడిరాజు ,కె.పెంటారావు మాట్లాడుతూ, డాక్‌యార్డు వంతెన సమస్యలపై నగర మేయర్‌, కలెక్టర్‌, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు కలగజేసుకోవాలని కోరారు. పాదయాత్రలో ఎస్‌.సూరిబాబు, గంగులు, ఆదినాయణ తిరుపతిరావు, సుభానీ, వెంకటేష్‌, సురేష్‌, రాజేశ్వరి, ఈశ్వరమ్మ 61వవార్డు ఉమా, విజయ, విమల, కల్యాణి, జయలక్ష్మి, వరలక్ష్మి, బంగారరాజు, వాసు, ఏసుబాబు పాల్గొన్నారు.

న్యాయవాదుల సంఘం ఎన్నికల ఫలితాలు

అధ్యక్ష, కార్యదర్శులుగా రాంబాబు, శ్రీనివాస్‌

గెలుపు సంకేతాన్ని చూపుతున్న విజేతలు

ప్రజాశక్తి- లీగల్‌ రిపోర్టర్‌ : విశాఖపట్నం న్యాయవాదుల సంఘం ఎన్నికల ఫలితాలు వెలువడ్డాయి. శుక్రవారం పోలింగ్‌ జరగ్గా, రాత్రి నుండి శనివారం వేకువజాము వరకు సాగిన ఓట్ల లెక్కింపులో సంఘం అధ్యక్షులుగా చింతపల్లి రాంబాబు, ప్రధాన కార్యదర్శిగా పైలా శ్రీనివాసరావు విజయం సాధించారు. అధ్యక్ష ఎన్నికల్లో రాంబాబు తన సమీప ప్రత్యర్థి తాళ్లూరి రవిపై 609 ఓట్లతో విజయం సాధించారు. ప్రధాన కార్యదర్శిగా పైలా శ్రీనివాసరావు, 1,016 ఓట్ల మెజార్టీతో సుగ్గు సుధీర్‌ రెడ్డిపై గెలుపొందారు. హోరాహోరీగా సాగిన ఉపాధ్యక్ష ఎన్నికల్లో ఎస్‌ఎస్‌.వాసుపై 66ఓట్ల తేడాతో బిఎస్‌ లత, సంయుక్త కార్యదర్శిగా అడపా సుధీర్‌రావుపై 60 ఓట్ల మెజార్టీతో దుర్గాప్రసాద్‌, గ్రంథాలయ కార్యదర్శిగా సబ్బవరపు గోపాలకృష్ణపై 552 ఓట్లు తేడాతో చింతాడ అర్చన, సాంస్కృతిక కార్యదర్శిగా ఎస్‌ కే హుస్సేన్‌పై 341 మెజార్టీతో ప్రకృతి శైలజ విజయం సాధించారు.

విజేతలను మాజీ అధ్యక్ష, కార్యదర్శులు వైద్యుల రవీంద్రప్రసాద్‌, వేణుగోపాల్‌, బార్‌ కౌన్సిల్‌ మెంబర్లు బైపా అరుణ్‌ కుమార్‌, ఎస్‌ కృష్ణమోహన్‌, బార్‌ కౌన్సిల్‌ ఉపాధ్యక్షులు రామజోగేశ్వరరావు, పలువురు సీనియర్‌ జూనియర్‌ న్యాయవాదులు కొత్త కమిటీకి అభినందనలు తెలిపారు.

పారిశుధ్య కార్మికులకు రేడియం జాకెట్లు

ప్రజాశక్తి- సీతమ్మధార: జివిఎంసి 25వ వార్డులో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు స్టాండింగ్‌ కమిటీ సభ్యుడు, స్థానిక కార్పొరేటర్‌ సారిపల్లి గోవింద్‌ చేతి గ్లౌజులు, రేడియం జాకెట్లను శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గోవింద్‌ మాట్లాడుతూ వచ్చేనెలలో నగరంలో ప్రతిష్టాత్మక జి 20 సదస్సుకు దేశ విదేశాలకు చెందిన ఎందరో ప్రముఖులు వస్తారని, నగరాన్ని పరిశుభ్రంగా ఉండేలా పారిశుధ్య కార్మికులు పనిచేయాలని హితువు పలికారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ నాయుడు, టిపిఎస్‌ తేజ, సిబ్బంది పాల్గొన్నారు

హాస్టల్‌ ఆధునికీకరణ పనులపై సమీక్ష

సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్‌ మల్లికార్జున

ప్రజాశక్తి - భీమునిపట్నం : స్థానిక బీచ్‌ రోడ్డులోని ప్రభుత్వ సమీకృత బాలికల వసతి గృహం ఆధునికీకరణ పనులను కలెక్టర్‌ డాక్టర్‌ ఎ.మల్లికార్జున శనివారం పరిశీలించారు. మండలంలోని చిప్పాడ దివీస్‌ సంస్థ సిఎస్‌ ఆర్‌ నిధులు రూ.59.17 లక్షలతో ఈ హాస్టల్‌లో ఆధునికీకరణ పనులు చేపడుతున్నారు. ప్రవేశ ద్వారం నుంచి వసతి గృహం వరకు రోడ్డు నిర్మాణం, భవనాల కిటికీలు, తలుపులు, మరుగుదొడ్లు, తాగునీటి పైపుల పునరుద్ధరణ పనుల పురోగతిని పరిశీలించారు.ఈ సందర్భంగా హాస్టల్‌ భవనాల స్థితిగతులు, సదుపాయాలపై బిసి సంక్షేమ అధికారులతో సమీక్షించారు.. జిల్లాలో వసతి గృహాల ఆధునికీకరణ, సౌకర్యాల కల్పనకు ముందుకొచ్చిన దివీస్‌, కోరమండల్‌ ఫెర్టిలైజర్స్‌, హెచ్‌పిసిఎల్‌ యాజమాన్యాలను కలెక్టర్‌ అభినందించారు.
ఈ సందర్భంగా దివీస్‌ సంస్థ డైరెక్టర్‌ మధుసూదనరావు మాట్లాడుతూ, రూ 2.50 కోట్ల సిఎస్‌ఆర్‌ నిధులతో జిల్లాలో పది హాస్టళ్లను ఆధునికీకరిస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ ఎస్‌.భాస్కరరెడ్డి, , జివిఎంసి జోనల్‌ కమిషనర్‌ బొడ్డేపల్లి రాము, తహశీల్దార్‌ కోరాడ వేణుగోపాల్‌, ఎంపిడిఒ పి వెంకటరమణ, జిల్లా బిసి సంక్షేమ అధికారులు (రూరల్‌, అర్బన్‌) కె శ్రీదేవి, ఎస్‌.వసంతకుమారి, అసిస్టెంట్‌ బిసి వెల్ఫేర్‌ ఆఫీసర్‌ జె జ్యోతిశ్రీ, వసతి గృహ సంక్షేమాధికారి సుజాత పాల్గొన్నారు

జ్యూట్‌ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

సిజెఎం మెకానికల్‌ వర్కర్స్‌ యూనియన్‌ (సిఐటియు) డిమాండ్‌

మాట్లాడుతున్న యూనియన్‌ గౌరవాధ్యక్షుడు మూర్తి

ప్రజాశక్తి -తగరపువలస : జ్యూట్‌ కార్మికులకు చెల్లించాల్సిన నష్ట పరిహారం, బకాయిలు ఇతర అంశాలపై న్యాయస్థానానికి తప్పుడు సమాచారం ఇచ్చిన జ్యూట్‌ యాజమాన్యంపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సిజెఎం మెకానికల్‌ వర్కర్స్‌ అండ్‌ హెల్పర్స్‌ యూనియన్‌ (సిఐటియు) ప్రభుత్వాన్ని డిమాండ్‌ చేసింది. శనివారం స్థానిక యూనియన్‌ కార్యాలయంలో విలేకర్లతో యూనియన్‌ గౌరవాధ్యక్షులు ఆర్‌ఎస్‌ఎన్‌ మూర్తి, వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ సాడి సూరిబాబు, ఉపాధ్యక్షులు ఎస్‌ అప్పలనాయుడు, బాబాజీ మాట్లాడారు. ఈ సందర్భంగా జ్యూట్‌ యాజమాన్యం వైఖరిని తీవ్రంగా ఖండించారు. ఓ వైపు కోర్టు లో కేసు విచారణ జరుగుతుండగా, మరో వైపు నష్ట పరిహారం, బకాయిలు చెల్లింపులపై యాజమాన్యం తప్పుడు ప్రచారం చేయడం దుర్మార్గమని ఖండించారు.

అపోలోలో గుండె, ఊపిరితిత్తుల మార్పిడి

సమావేశంలో మాట్లాడుతున్న అపోలో వైద్యబృందం

ప్రజాశక్తి - ఆరిలోవ : గుండె, ఊపిరితుత్తుల మార్పిడి ఆపరేషన్లను నాలుగు ప్రధాన నగరాల్లోని అపోలో ఆసుపత్రి యూనిట్లలో విజయవంతంగా నిర్వహిస్తున్నట్లు అపోలో వైద్యబృందం వెల్లడించింది. శనివారం ఆరిలోవ హెల్త్‌సిటీ అపోలో ఆసుపత్రిలో విలేకర్లతో అపోలో వైద్యనిపుణుల బృందం మాట్లాడుతూ, గుండె, ఊపిరితిత్తుల సమస్యలతో ఆక్సిజన్‌పై ఆధారపడి దైనందిన కార్యక్రమాలను చేసుకోలేని రోగులకు అవయవ మార్పిడి అవసరమౌతుందన్నారు. అపోలో ఆసుపత్రిలో ట్రాన్స్‌ప్లాంట్‌ ఇమ్యునాలజీ, ఇన్‌ఫెక్షియస్‌ డిసీజ్‌ స్పెషాలిటీ, పల్మోనాలజీ, కార్డియాలజీ, ఇంటెన్సివ్‌ కేర్‌, ఎక్మో సర్వీసెస్‌, నర్సింగ్‌ కేర్‌తో పాటు మరిన్ని సపోర్టింగ్‌ స్పెషాలిటీలు అందుబాటులో ఉన్నట్టు తెలిపారు. రోగికి అవయవ మార్పిడి జరిగి డిశ్చార్జి చేసి ఇంటికెళ్లిన తర్వాత కూడా వైద్యులు ఫోనులోఅందుబాటులో ఉంటారన్నారు. సమావేశంలో డాక్టర్‌ నరేష్‌, డాక్టర్‌ రామక్రిష్ణ, డాక్టర్‌ చక్రధరరావు, డాక్టర్‌ అచ్యుత్‌, డాక్టర్‌ జయదీప్‌ కుమార్‌ త్రివేధి, డాక్టర్‌ విజయ్‌ పాల్గొన్నారు.

గెడ్డను కప్పేస్తున్నా పట్టించుకోరేం..?

హెచ్చరిక బోర్డును పెట్టినా, వేస్తున్న వ్యర్థాలు

ప్రజాశక్తి -పిఎం పాలెం : మారికవలస గ్రామం సమీపంలోని గెడ్డను కప్పేస్తూ పిల్లకాలువలా మార్చేస్తున్నా రెవెన్యూ, జివిఎంసి అధికారులు పట్టించుకోకపోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. గతంలో కొంతమంది కబ్జాదారులు గెడ్డలో వ్యర్థాలను వేసి కప్పేయడం ద్వారా ఆక్రమణకు సిద్ధమౌతున్న తరుణంలో చిన్నగదిలి రెవెన్యూ అధికారులు స్పందించి అక్కడ హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. అయితే హెచ్చరిక బోర్డు ఉన్నా తమకేమిటన్నట్లు ఆ బోర్డును సైతం కప్పేసేలా నేటికీ గెడ్డలో మట్టి, భవన నిర్మాణ వ్యర్థాలను వేస్తూనే ఉన్నారు.

ఏదో ఒకనాటికి గెడ్డను కబ్జా చేయడమే లక్ష్యంగా ఈ వ్యర్థాలు వేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నన్న నేపథ్యంలో ఇప్పటికైనా సంబంధిత రెవెన్యూ అధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. గెడ్డను కప్పేయడం వల్ల ప్రస్తుతానికి ఫర్వా లేకున్నా వర్షాల సీజన్‌లో ఎగువ ప్రాంతాల్లో ముంపు సమస్య ఉత్పన్నమౌతుందని పలువురు అంటున్నారు. అంతేకాక ఇలా కప్పేసుకుంటూ పోతే కొన్నాళ్లకు గెడ్డ కనుమరుగౌతుందని పలువురు అంటున్నారు.

తోకాడ సమైక్య అపార్ట్‌మెంట్‌లో

సమస్యలను పరిష్కరించాలి

- ఎమ్మెల్యేకు అపార్ట్‌మెంట్‌వాసుల వినతి

ప్రజాశక్తి -గాజువాక : తోకాడ సమైక్య అపార్ట్‌మెంట్‌లోని సమస్యలు పరిష్కరించాలని సమైక్య అపార్ట్‌మెంట్‌, తోకాడ ఫ్లాట్‌ ఓనర్స్‌ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ అధ్యక్షులు ఎం.వెంకటేశ్వరరావు, కార్యదర్శి ఎ.తవిటయ్య, ఉపాధ్యక్షులు తవుడన్న, కమిటీ సభ్యులు కోరారు. ఈమేరకు శనివారం సాయంత్రం గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు.
కాలనీలో ప్రధాన రహదారి, మురుగు కాలువలు నిర్మాణం, వీధిమార్గం బోర్డు, వీధిదీపాల ఏర్పాటు చేయాలని కోరారు. ఆటోనగర్‌ డి బ్లాక్‌లోని డంపింగ్‌ యార్డ్‌లో చెత్త కాల్చడం వల్ల వెలువడే పొగ కాలుష్యం నివారణకు చర్యలు తీసుకోవాలని కోరారు. వర్షాకాలంలో కట్ట తెగి కుంచుమాంబ కాలనీని ముంచెత్తుతున్న తోకాడ చెరువును అభివృద్ధి చేసి, వాకింగ్‌ ట్రాక్‌, ఇతర సుందరీకరణ పనులు చేపట్టాలని కోరారు జనావాసాల వద్ద భారీవాహనాల రాకపోకలను నియంత్రించాలని, పందులు, వీధి కుక్కల బెడద నివారించాలని కోరారు.శ్రీనగర్‌, ఆటోనగర్‌ మీదుగా మింది లేదా షీలానగర్‌ వైపు ఆర్‌టిసి బస్సు సౌకర్యం, ఎపిఐఎసి సెంట్రల్‌ పార్క్‌లో ఓపెన్‌ జిమ్‌ పరికరాలు ఏర్పాటు చేయాలని కోరారు. అసోసియేషన్‌ సభ్యులు చౌదరి, మహిళా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నందవరపు సోములుకు సన్మానం

సోములను సత్కరిస్తున్న మహిళా సంఘాల ప్రతినిధులు

ప్రజాశక్తి -గోపాలపట్నం : 92వ వార్డు పద్మనాభనగర్‌లో గ్రామాభ్యుదయ సంఘాన్ని స్థాపించి, 36ఏళ్లుగా సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్న రాష్ట్ర యువశక్తి అవార్డు గ్రహీత నందవరపు సోములును శనివారం మహిళా, పౌర సంఘాలు ఘనంగా సత్కరించాయి. వికలాంగులకు బాపూజీ దివ్యాంగుల సేవా సంఘం. మదర్‌ తెరిసా ఛారిటబుల్‌ ట్రస్ట్‌, గోపాలపట్నం కళాపీఠం వంటి ఎన్నో సంస్థలను స్థాపించి, పలు అవార్డులు, రివార్డులు అందుకున్న సోములు సేవలను కొనియాడారు. కార్యక్రమంలో పౌర సంఘాల అధ్యక్షులు సన్యాసిరావు,సాలాబ్‌ శ్రీనివాసరావు, చందు సుబ్బారావు, బల్ల రామానాయుడు, కంపర అప్పారావు, మహిళా సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు

పన్నుల వసూలు

పన్నుల వసూళ్ల డ్రైవ్‌లో టిపిఎస్‌ తేజ,సిబ్బంది

ప్రజాశక్తి- సీతమ్మధార : జివిఎంసి మూడవ జోన్‌ ఎసిపి వెంకటేశ్వరరావు ఆదేశాల మేరకు టిపిఎస్‌ తేజ ఆధ్వర్యంలో జోన్‌ పరిధిలో ఆస్తి పన్ను వసూళ్లు ముమ్మరంగా చేపడుతున్నారు. శనివారం శంకరమఠం రోడ్డు, శాంతిపురం, డైమండ్‌ పార్కు, సీతంపేట పరిసర ప్రాంతాల్లో సుమారు రూ.80వేల పన్నుల వసూలు చేసినట్లు టిపిఎస్‌ తేజ తెలిపారు ఈ సందర్భంగా తేజ మాట్లాడుతూ సకాలంలో పన్నులు చెల్లించి, జివిఎంసి అభివృద్ధికి నగర ప్రజలు సహకరించాలని కోరారు.జోన్‌ పరిధిలో పన్నుల వసూలు లక్ష్యం రూ.1.30కోట్లు ఉండగా, ఇప్పటివరకు రూ.97లక్షలు వసూలు చేశామని టిపిఎస్‌ తేజ తెలిపారు. కార్యక్రమంలో చైన్‌మ్యాన్‌ ప్రసన్న కుమార్‌, ప్లానింగ్‌ సెక్రటరీ కృష్ణ, జివిఎంసి సిబ్బంది పాల్గొన్నారు

న్యాయబద్ధమైన ప్యాకేజీని ప్రకటించాలి

తోటాడ రెవెన్యూ పరిధిలోని నిర్వాసితుల డిమాండ్

ప్రజాశక్తి- మునగపాక రూరల్

అనకాపల్లి- అచ్యుతాపురం రోడ్డు విస్తరణలో భాగంగా భూములు, ఇళ్లు కోల్పోతున్న తోటాడ రెవెన్యూ పరిధిలోని నిర్వాసితులకు న్యాయమైన ప్యాకేజ్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. నిర్వాసితుల సమావేశం మండలంలోని గంగా దేవిపేటలోని పైడిమాంబ ఆలయంలో శనివారం జరిగింది. తోటాడ రెవెన్యూ పరిధిలో 110 మంది నిర్వాసితులు ఉండగా అరకొర సమాచారంతో 50, 60 మందితో ఏర్పాటు చేసిన ఈ సమావేశం అర్ధాంతంగా ముగిసింది. మూడు సమావేశాల్లోనూ అనకాపల్లి ఆర్డీవో చిన్నికృష్ణ న్యాయబద్ధమైన పరిహారం ప్రకటించకపోవడంతో సమావేశాలు వాయిదాలు పడుతూ వస్తున్నాయి. ఈ నేపథ్యంలో శనివారం ఆర్డిఓ నిర్వాసితులతో మరోసారి సమావేశం ఏర్పాటు చేసి వ్యవసాయ భూములకు గజానికి రూ.8,500, వ్యవసాయేతర భూములకు గజానికి రూ.12,000 చొప్పున ఇవ్వనున్నట్లు చెప్పారు. దీంతో నిర్వాసితులు సమావేశం నుండి బయటకు వెళ్లిపోవడంతో పరిహారం మీరే నిర్ణయించుకుని సమావేశానికి హాజరుకావాలని రైతులను ఆర్డీవో కోరారు. వ్యవసాయ భూములకు, వ్యవసాయేతర భూములకు సరి సమానంగా రూ.15,000 చొప్పున పరిహారం ప్రకటిస్తేనే భూములు ఇస్తామని, లేకుంటే ఇచ్చేది లేదని నిర్వాసితులు తెగేసి చెప్పారు. అయితే నిర్వాసితులు కోరిన పరిహారాన్ని ఆర్డీవో తోసిపుచ్చారు. వ్యవసాయేతర భూములకు రూ.12,000, వ్యవసాయ భూములకు 8,500 చెల్లిస్తామని, అంతకంటే ఇచ్చేది లేదని, దీనికి ఆమోదం లేకపోతే కోర్టును ఆశ్రయించాల్సి వస్తుందని ఆర్‌డిఒ స్పష్టం చేశారు. మునగపాక, నాగులాపల్లి, తిమ్మరాజుపేట గ్రామాలకు బేసిక్ వ్యాల్యూ ప్రకారంగా పరిహారం ప్రకటించారని, అదే బేసిక్ వ్యాల్యూ ఇక్కడ ఎందుకు పరిగణనలోకి తీసుకోలేదని నిర్వాసితుల సంఘం నాయకులు బొద్దపు శ్రీరామ్మూర్తి, కన్వీనర్ ఎస్.బ్రహ్మాజీ ఆర్డిఓ చిన్ని కృష్ణతో వాగ్వాదానికి దిగారు. మెజారిటీ నిర్వాసితుల ఆమోదం లేకుండా కోర్టుకు ఏ విధంగా వెళతారని ప్రశ్నించారు. మరోసారి పరిహారం విషయంపై పునరాలోచించి న్యాయబద్ధమైన ప్యాకేజీని ప్రకటించాలని ఆర్డీవోను కోరారు.

రైతులతో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌డిఒ చిన్నికృష్ణ

పట్టాలతో చిన్నారులు

సంస్కృతి గ్లోబల్ స్కూల్‌లో పట్టభద్రుల వేడుక

ప్రజాశక్తి - పరవాడ

సంస్కృతి గ్లోబల్ స్కూల్‌లో కిండర్ గార్డెన్ చిన్నారుల పట్టభద్రుల వేడుక శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాథమిక విద్యకు అర్హత సాధించిన పలువురు చిన్నారులకు పట్టాలు అందజేశారు. ఇందులో ముఖ్య అతిథిగా పాల్గొన్న బ్రాండెక్స్ జనరల్ మేనేజర్ రాబర్ట్ పి.ఫర్గుసన్ మాట్లాడుతూ ఇలాంటి వేడుకలు పిల్లల్లో దాగి ఉన్న మృదువైన నైపుణ్యాన్ని వెలికి తీయడానికి ఉపయోగపడతాయని తెలిపారు. నేటి పోటీ ప్రపంచంలో కేవలం పుస్తకం జ్ఞానం పొందిన విద్యార్థులు కంటే మృదు నైపుణ్యం గల వారు ఎక్కువగా రాణిస్తున్నారని చెప్పారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఈ మార్పును అంగీకరించి మార్కుల ముసుగు ధోరణికి స్వస్తి పలకాలని హితావు పలికారు. పాఠశాల డైరెక్టర్ పి.ఉదయ నాగశ్రీ మాట్లాడుతూ చిన్నారుల తరగతి గది తన ఛాంబర్‌కు దగ్గరగా ఉండడంతో వాళ్ళ చేసే శబ్దాలు తియ్యని వేణుగానంలా అనిపిస్తున్నాయని చెప్పారు. పాఠశాల ప్రిన్సిపాల్ ఎన్.సీతాలక్ష్మి మాట్లాడుతూ కిండర్ గార్డెన్ చిన్నారులు ఆట పాటలతో నేర్చుకున్న విద్య వారి ప్రాథమిక విద్యకు తోడ్పడాలని ఆకాంక్షించారు. చిన్నారులు చేసిన పలు నృత్యప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో మోనాలిసా, అరుణ, లీసా, మహిమ, రామన్ కౌర్, నిశాంత్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న గురుకుల విద్యార్థులు

అంబేద్కర్ జీవిత చరిత్రపై వ్యాసరచన పోటీలు

ప్రజాశక్తి-దేవరాపల్లి

డాక్టర్ బిఆర్.అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని ఆయన జీవిత చరిత్రపై గురుకుల పాఠశాల విద్యార్థులకు శనివారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా గురుకుల పాఠశాల పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ విశాఖ, అనకాపల్లి జిల్లాల్లోని 18 పాఠశాలల్లో ఈ పోటీలు నిర్వహించి, అంబేద్కర్ జయంతి రోజున జిల్లా స్థాయిలో బహుమతుల ప్రదానం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గురుకుల పాఠశాల పూర్వ విద్యార్థులు మైలవరపు కైలాస్, కంచిమాల అప్పారావు, విమల, చైతన్య, పాఠశాల ప్రిన్సిపాల్ సిహెచ్ రవీంద్రనాథ్, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ ఉల్లి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలు వర్తించవా?

చోడవరంలో ప్రభుత్వ, రాజకీయ నేతల కటౌట్ల దర్శనం

ప్రజాశక్తి-చోడవరం

ఎన్నికల కోడ్ నిబంధనలు అధికార, ప్రధాన ప్రతిపక్ష పార్టీలకు వర్తించవా? అని పలువురు ప్రశ్నిస్తున్నారు. రాష్ట్రంలోని ఎమ్మెల్సీ ఎన్నికల జరుగుతున్న జిల్లాల్లో ఎన్నికల కోడ్ అమల్లో ఉంది. ఈ జిల్లాల్లో ఎన్నికల నిబంధనలు ప్రకారం ప్రభుత్వ, రాజకీయ నాయకుల కటౌట్లు, ఫ్లెక్సీలు ఉండకూడదు. ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో ఎన్నికల కోడ్ అమల్లో ఉండగా, చోడవరంలో అధికారులు ఆ నిబంధనలను తుంగలోకి తొక్కినట్లు కనబడుతుందని పలువురు విమర్శిస్తున్నారు. చోడవరం పట్టణంలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఫొటోతో ఫ్లెక్సీలు దర్శనమిస్తున్నాయి. అంతే కాకుండా అధికార వైసిపి, ప్రతిపక్ష టిడిపి, బిజెపికి చెందిన ఫ్లెక్సీలు మండల కేంద్రంలోనే కనబడుతున్నాయి. గవరవరం కొత్తూరు జంక్షన్ రోడ్డులో వైసిపికి చెందిన ఫ్లెక్సీలు, బల్క్ మిల్క్ కూలింగ్ సెంటర్ వద్ద టిడిపి ఫ్లెక్సీలు ఉన్నాయి. వీటిని చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్న అధికారుల తీరును పలువురు విమర్శిస్తున్నారు.



చోడవరంలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఫొటోతో ఉన్న కటౌట్

వైసిపిలో చేరిన విశ్వబ్రాహ్మణులు

ప్రజాశక్తి-చోడవరం

విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో వివిధ వృత్తులు చేసుకునే సుమారు 40 మంది విశ్వబ్రాహ్మణులు స్థానిక ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ సమక్షంలో వైసిపిలో చేరారు. ఈ సందర్భంగా ధర్మశ్రీ మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంపై నమ్మకంతో విశ్వబ్రాహ్మణులు పార్టీలో చేరడం అభినందనీయమన్నారు. వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. అనంతరం కామాక్షి కార్పెంటర్ సంఘం ఆధ్వర్యంలో ధర్మశ్రీని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు ఒరుగంటి నెహ్రూ, దేవరపల్లి సత్య, సర్పంచ్ శ్రీను, పట్నాల జగదీష్, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వినాయక ఆలయ 40వ వార్షికోత్సవం

ప్రజాశక్తి -అనకాపల్లి

స్థానిక శారద నగర్ బాల వినాయక దేవాలయం 40వ వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా పార్లమెంటు సభ్యురాలు డాక్టర్ సత్యవతి కృష్ణమూర్తి దంపతులు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ వారిని దుస్సాలువతో సత్కరించి జ్ఞాపికను బహుకరించారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల ప్రధాన కార్యదర్శి భీశెట్టి జగన్, కమిటీ సభ్యులు కరణం మురళీకృష్ణ, కరణం సత్యనారాయణరావు, సాంబశివరావు, అప్పారావు, మోహన్‌రావు, వేపాడ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ సత్యవతి దంపతులకు జ్ఞాపిక అందజేస్తున్న కమిటీ సభ్యులు

వైసిపి నేత దాడిపై సచివాలయ ఉద్యోగుల నిరసన

- కేసు నమోదు చేయాలని పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు
- బాధితులకు సిఐటియు నేతల సంఘీభావం

ప్రజాశక్తి- చోడవరం

మండలంలో అడ్డూరు గ్రామ సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ బి.సతీష్‌పై వైసిపి నాయకులు ఎలమంచిలి పోతినాయుడు దాడి చేయడంపై సచివాలయ ఉద్యోగులు శనివారం ఎంపిడిఒ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. దీనికి ముందు పోతి నాయుడుపై కేసు నమోదు చేయాలని, తమకు రక్షణ కల్పించాలని కోరుతూ స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. సచివాలయ ఉద్యోగుల నిరసనకు ఏపీ గ్రామ/వార్డు సచివాలయ ఉద్యోగుల సమాఖ్య నాయకులు ఆర్.శంకర్రావు, సిఐటియు జిల్లా నాయకులు వివి శ్రీనివాసరావు, ఎస్‌వి.నాయుడు సంఘీభావం తెలిపారు. వైసిపి నేత దాడిని తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వెల్ఫేర్ అసిస్టెంట్‌పై వైసిపి నేత పోతినాయుడు సచివాలయ ఉద్యోగులు, గ్రామ పెద్దలు, వైసిపి నాయకులు ఉండగానే సచివాలయంలోనే దాడి చేయడం దుర్మార్గమన్నారు. ఉన్నత చదువులు చదువుకొని, సచివాలయ ఉద్యోగులుగా ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరువ చేస్తున్న వారిపై అధికార పార్టీ నాయకులు దాడులకు పాల్పడడం సిగ్గుచేటన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు కనీస భద్రత కల్పించకపోవడం అన్యాయమన్నారు. ఈ సంఘటనపై వెంటనే విచారం జరిపించి దాడి చేసిన వైసిపి నాయకుడు పోతినాయుడును అరెస్టు చేయాలని, సచివాలయ ఉద్యోగులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. లేకుంటే జిల్లా వ్యాప్తంగా సచివాలయ ఉద్యోగులతో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

పోలీసు స్టేషన్ ఎదుట సచివాలయ ఉద్యోగులు, మీడియాతో మాట్లాడుతున్న బాధిత ఉద్యోగి సతీష్

తుమ్మపాల సుగర్ ఫ్యాక్టరీని పరిరక్షించాలి

- లేకుంటే మంత్రి పదవికి అమర్‌నాథ్ రాజీనామా చేయాలి
- అఖిలపక్ష ప్రజా సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం డిమాండ్

ప్రజాశక్తి-అనకాపల్లి

రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ తుమ్మపాల సుగర్ ఫ్యాక్టరీని పరిరక్షించాలని, లేకుంటే తక్షణమే రాజీనామా చేయాలని అఖిలపక్ష ప్రజాసంఘాలు డిమాండ్ చేశాయి. స్థానిక కోడిగంటి గోవిందరావు భవనంలో ప్రజా రాజకీయ వేదిక కన్వీనర్ కనిశెట్టి సురేష్ బాబు అధ్యక్షతన శనివారం అఖిలపక్ష సంఘాల రౌండ్ టేబుల్ సమావేశంలో పలు సంఘాల ప్రతినిధులు మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో సుగర్ ఫ్యాక్టరీని విక్రయించే ప్రయత్నాలను ఉద్యమాల ద్వారా ప్రతిఘటించి పరిరక్షించుకున్న సంగతిని గుర్తు చేశారు. నాటి ఉద్యమానికి తలొగ్గిన ప్రభుత్వం రూ.33 కోట్లు విడుదల చేసి 2018- 19 క్రషింగ్ సీజన్లో గానుగాట ఆడిందని చెప్పారు. నాటి ఉద్యమంలో పాల్గొన్న అమర్నాథ్ ఫ్యాక్టరీని ఆధునికీకరించాలని చెప్పి నేడు అందుకు విరుద్ధంగా ఫ్యాక్టరీని అమ్మడానికి పూనుకోవడం దుర్మార్గమన్నారు. 2019 ఎన్నికల ముందు ప్రతిపక్ష నేత హోదాలో వైఎస్.జగన్మోహన్ రెడ్డి అనకాపల్లి బహిరంగ సభలో తాము అధికారంలోకి వస్తే తుమ్మపాల సుగర్ ఫ్యాక్టరీని ఆధునికీకరిస్తామని హామీ ఇచ్చిన సంగతి మరిచారా? అని ప్రశ్నించారు. ప్రభుత్వం తక్షణమే లిక్విడేషన్ ప్రక్రియను వెనక్కు తీసుకోవాలని, వచ్చే ఏడాది గానుగాటకు అవసరమైన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సిపిఐ నాయకులు వైన్ భద్రం, సిపిఎం నాయకులు ఎ.బాలకృష్ణ, పలు సంఘాల నాయకులు విల్లూరి పైడారావు, కర్రి అప్పారావు, గంట శ్రీరామ్, శ్రీరామదాసు గోవింద, రాజాన దొరబాబు, కోన లక్ష్మణ, కోరిబిల్లి శంకర్రావు, దూలం గోపి, మల్ల శ్రీను, బొడ్డేడ అప్పారావు, బొట్ట చిన్ని యాదవ్, ఆళ్ల ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రౌండుటేబుల్ సమావేశంలో పాల్గొన్న అఖిలపక్ష ప్రజా సంఘాల నేతలు

బహుమతులు చూపుతున్న విజేత విద్యార్థులు

తెలుగు భాష పరిరక్షణకు కృషి

ప్రజాశక్తి-అనకాపల్లి

తెలుగు భాషను పరిరక్షించుకునేందుకు అందరూ కృషి చేయాలని తెలుగు భాష పరిరక్షణ సమితి కన్వీనర్ కోయిలాడ రామ్మోహన్ రావు పిలుపునిచ్చారు. స్థానిక గాంధీనగర్ వెనుకబడిన తరగతుల బాలుర వసతి గృహంలో శనివారం సమితి ఆధ్వర్యంలో తెలుగు భాషకు వెలుగునిద్దాం అనే కార్యక్రమం కథా రచయిత జి రంగబాబు అధ్యక్షతన జరిగింది. కార్యక్రమానికి సమన్వయకర్తగా వ్యవహరించిన రామ్మోహన్ రావు మాట్లాడుతూ తెలుగు భాష పరిరక్షణకు సమితి కృషి చేస్తుందని చెప్పారు. మహాభారతంపై ఆగస్టులో పోటీలను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అనంతరం రామాయణ ఘట్టాలపై విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన జి.లల్లు ప్రసాద్, సంతోష్, జి.సాయికు బహుమతుల ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో సమితి సభ్యులు శిష్లా తమ్మిరాజు, డాక్టర్ ఇమ్మిడిశెట్టి చక్రపాణి, జివిఎల్ఎన్ శాస్త్రి, వార్డెన్ పికెవి నారాయణరావు, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ సురేష్ కుమార్, రమణ పాల్గొన్నారు.

వికలాంగుల పట్ల చిన్నచూపు తగదు

ప్రజాశక్తి-అనకాపల్లి : రాష్ట్ర ప్రభుత్వం వికలాంగుల పట్ల చిన్న చూపు చూడటం తగదని విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు పాతరపల్లి వీరు యాదవ్ అన్నారు. స్థానిక పుడ్ పేట సంఘం కార్యాలయంలో శనివారం దాతల సహకారంతో వికలాంగులకు వీల్‌చైర్, చంక కర్రలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వికలాంగుల సంక్షేమ పథకాలను రాష్ట్ర ప్రభుత్వం పడకెక్కించిందని విమర్శించారు. వికలాంగుల కార్పొరేషన్‌ను నిర్వీర్యం చేశారన్నారు. వికలాంగులకు రూ.6000 పింఛన్ ఇచ్చి ఆదుకోవాలని, షూరిటీ లేని స్వయం ఉపాధి రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పల్ల బాపూజీ, పార్థు శ్రీనివాస్, నామ చంద్రశేఖర్, శివకోటి శ్రీనివాస్, షేక్ నూర్, మొల్లి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

భారీ అన్న సమారాధన

ప్రజాశక్తి-దేవరాపల్లి

స్థానిక ఉమామహేశ్వరి దేవి కల్యాణ మహోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం భారీ అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనిని ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు ప్రారంభించారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై అమ్మవారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎంపిపి కిలపర్తి భాస్కరరావు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం అమ్మవారి ఉత్సవాలు భారీగా నిర్వహించి అన్న సమారాధన ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు పరవాడ రవి, వచ్చా రమేష్, వైసిపి నాయకులు వరదపు రెడ్డి సింహాచలం నాయుడు, లలిత నాయుడు, దేవి శంకర్రావు, వాలేటి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా షిర్డీసాయి ఆలయ వార్షికోత్సవం

ప్రజాశక్తి-కశింకోట

మండలంలోని గొకివానిపాలెం గ్రామంలో శ్రీషిర్డీ సాయి ఆలయ 19వ వార్షికోత్సవం, శ్రీవరసిద్ధి వినాయక 6వ వార్షికోత్సవం శనివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయ కమిటీ వ్యవస్థాపకులు రౌతు సోమేశ్వరరావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో యల్లపు శ్రీనివాసరావు దంపతులు, చుట్టూ పక్కల గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

పూజలు చేస్తున్న ఆలయ వ్యవస్థాపకులు సోమేశ్వరరావు

'జెడ్‌పిటిసి రాంబాబు వ్యాఖ్యలు దారుణం'

మాట్లాడుతున్న వైసిపి నాయకులు

ప్రజాశక్తి బుచ్చయ్యపేట

జగనన్న కాలనీల్లో అక్రమాలు జరిగాయని, అనార్హులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేశారని స్థానిక జెడ్పిటిసి దొండా రాంబాబు జిల్లా పరిషత్ సమావేశంలో మాట్లాడటం సరికాదని మండలంలోని పలువురు వైసిపి నాయకులు, ఆ పార్టీ ప్రజాప్రతినిధులు అన్నారు. మండలంలోని మల్లం సర్పంచ్ బర్ల శివకు పరామర్శించడానికి వచ్చిన వారు విలేకర్లతో మాట్లాడారు. మండలంలో ఎటువంటి అక్రమాలు, అవినీతి జరగలేదన్నారు. స్థానిక శాసన సభ్యులు కరణం ధర్మశ్రీ సారథ్యంలో మండలం అభివృద్ధి పథంలో దూసుకుపోతుందని చెప్పారు. అధికార పార్టీ జెడ్‌పిటిసి ఉన్న రాంబాబు వైసిపి నియమ, నిబంధనలకు విరుద్ధంగా పనిచేస్తున్నారని విమర్శించారు. రాంబాబు ఇలాంటి ఆరోపణలు మానుకోవాలని హితవుపలికారు. ఈ సమావేశంలో వైసిపి మండల అధ్యక్షులు కొల్లిమల్ల అచ్చింనాయుడు, విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, ఎంపీపీ దాకారపు నాగేశ్వరిదేవి నాగరాజు, వైస్ ఎంపీపీ గొంపా చినబాబు, ఎంపీటీసీల ఫోరమ్ మండల అధ్యక్షులు దేవర అప్పారావు, సర్పంచ్‌ల ఫోరమ్ మండల అధ్యక్షులు మరిసా నాని, వైసిపి మండల వర్కింగ్ ప్రెసిడెంట్ నమ్మి అప్పలరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి జోగా కొండబాబు, పలువురు సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణంలో తనిఖీలు చేస్తున్న విజిలెన్స్ అధికారులు

ఎరువుల దుకాణాలపై విజిలెన్స్ దాడులు

ప్రజాశక్తి-దేవరాపల్లి

మండల కేంద్రంలోని పలు ఎరువులు దుకాణాలపై శనివారం విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తున్న సూర్య జనరల్ స్టోర్‌పై 6ఏ కేసును నమోదు చేసినట్లు విజిలెన్స్ సిఐ ఎస్.లక్ష్మోజి తెలిపారు. 21 యూరియా బస్తాలను సీజ్ చేసినట్లు వెల్లడించారు. విజిలెన్స్ అధికారులు వచ్చారన్న సమాచారంతో చాలా దుకాణాలు మూతపడ్డాయి. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి ఎల్ వై కాంతమ్మ, విస్తరణ అధికారి ఎస్.కిరణ్ కుమార్, విజిలెన్స్ సిబ్బందితో పాల్గొన్నారు.

రాజాంలో 'పొలం బడి'

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట

మండలంలోని రాజాం గ్రామంలో శనివారం వైఎస్ఆర్ పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. రబీలో నువ్వులు సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి బి. భాస్కర్ రావు మాట్లాడుతూ రైతులు రసాయనక ఎరువులు వాడకం తగ్గించి సేంద్రియ ఎరువులు వాడకం పెంచాలని, సమగ్ర సస్య రక్షణ పద్ధతులు పాటించాలని తెలిపారు. నువ్వుల్లో పూతదశలో బూడిద తెగులు, పిల్లోడు తెగులు ఎక్కువగా వ్యాపిస్తుందని చెప్పారు. పిల్లోడు తెగులు నివారణకు డైమీతోయేట్ 1లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలని సూచించారు. కలుపు నివారణ చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీఈఓ సంతోష్, శ్రీను పలువురు రైతులు పాల్గొన్నారు.

118వ రోజుకు నేవీ నిర్వాసితుల ఆందోళన

ప్రజాశక్తి -రాంబిల్లి

తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మండలంలోని వాడనర్సాపురం వద్ద ఎన్ఎఒబి ప్రధాన గేట్ ముందు నేవీ నిర్వాసితులు చేస్తున్న ఆందోళన 118వ రోజుకు చేరింది. తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని పెద్ద పెట్టున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నేవీ నిర్వాసిత జెఎసి నాయకులు మాట్లాడుతూ అధికారులు శుక్రవారం విడుదల చేసిన మినిట్స్ కాపీలో సరిగ్గా పొందుపరచలేదని తెలిపారు. మళ్లీ తెస్తామని చెప్పి శనివారం రాకపోవడం సరికాదని పేర్కొన్నారు. 8 గ్రామాలను నిర్వాసిత గ్రామాలుగా గుర్తించి పరిహారం, పునరావాసం కల్పించాలని కోరారు. కొన్నింటిని గుర్తించకపోవడం సరికాదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎనిమిది గ్రామాల నిర్వాసితులు పాల్గొన్నారు.

ఎంపీ సత్యవతిని కలిసిన సాయిబాబా

ప్రజాశక్తి- అనకాపల్లి : వైసిపి పబ్లిక్ వింగ్ అనకాపల్లి జిల్లా చైర్మన్‌గా నియమితులైన పాయకరావుపేట నియోజకవర్గానికి చెందిన దగ్గుపల్లి సాయిబాబా శనివారం ఎంపీ డాక్టర్ బివి.సత్యవతిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సాయిబాబాను ఎంపీ సత్యవతి సాలువతో సత్కరించి రానున్న ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కే రామ్మోహన్‌రావు, టి సతీష్, ఎంబిబి ప్రసాద్, సిహెచ్ అచ్యుతరాజు, బాబు తదితరులు పాల్గొన్నారు.

ఉప ముఖ్యమంత్రిని కలిసిన గురువులు

ప్రజాశక్తి-దేవరాపల్లి : ఎమ్మెల్సీగా ఎంపికైన రాష్ట్ర మత్స్యకారుల కార్పొరేషన్ చైర్మన్ కోలా గురువులు శనివారం ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడును తారువలోని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కోలా గురువులను డిప్యూటీ సిఎం అభినందించారు. ఈ కార్యక్రమంలో బిసి కార్పొరేషన్ డైరెక్టర్ రామన్న పాత్రుడు పాల్గొన్నారు.

సాగు భూములకు పట్టాలివ్వాలి

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట

మండలంలోని రాజాం గ్రామంలో కొంతకాలంగా తమ సాగులో ఉన్న భూములకు పట్టాలు మంజూరు చేయాలని చిట్టయ్యపాలెం గ్రామానికి చెందిన దళితులు విజ్ఞప్తి చేశారు. శనివారం వారు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ సర్వే నెంబర్ 233లో గల కొండ పోరంబోక భూమిని తాము సాగు చేసుకుంటున్నామని తెలిపారు. ఆ భూములకు సమగ్ర సర్వేలో తమకు పట్టాలు మంజూరు చేయాలని స్థానిక శాసనసభ్యులకు వినతిపత్రం అందజేశామని చెప్పారు. అయితే రాజాం గ్రామానికి చెందిన కొంతమంది రెవెన్యూ అధికారులు, వైసిపి నాయకులపై విమర్శలు చేస్తున్నారని తెలిపారు. తమ సాగులో ఉన్న భూములకు పట్టాలు మంజూరు చేయాలని దళితులు ముత్యాల అర్జునమ్మ, ముత్యాల మంగా, బుర్ర నూకరత్నం, కోరిబిల్లి లోవ, నాగు బిల్లి నాగమణి, బుర్ర రమాదేవి, ముత్యాల నాగమణి ఎత్తుల తలుపులమ్మ తదితరులు కోరారు.

మాట్లాడుతున్న బాధిత దళితులు

మహాధర్నాను విజయవంతం చేయండి

ప్రజాశక్తి- అనకాపల్లి

జగనన్న గృహ నిర్మాణాలకు రూ.5 లక్షలు కేటాయించాలని, టిడ్కో గృహాలను లబ్ధిదారులకు అందజేయాలని కోరుతూ మార్చి 2న విజయవాడలో సిపిఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మహాధర్నాకు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని ఆ పార్టీ పట్టణ సహాయ కార్యదర్శి కోన లక్ష్మణ పిలుపునిచ్చారు. పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జగనన్న ఇళ్ల కాలనీ లబ్ధిదారులకు ఇసుక, సిమెంట్ ఉచితంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. కొండలు గుట్టలు, వాగులు, వంకలు, శ్మశాన వాటికల్లో ఇళ్ల స్థలాలు ఇవ్వడం, మౌలిక సదుపాయాలు కల్పించకపోవడంతో లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణం చేసుకోవడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఐదేళ్ల కిందట పూర్తయిన టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు ఎప్పుడు కేటాయిస్తారని ప్రశ్నించారు. సమావేశంలో ఏఐటీయూసీ నాయకులు ఉప్పులి ఆదినారాయణ, నూక అప్పారావు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాల్లో ఇబ్బందులు తెలపాలి

ఆర్‌డిఒ జయరాం

మాట్లాడుతున్న ఆర్‌డిఒ

ప్రజాశక్తి-నర్సీపట్నంరూరల్:మండలంలోని ధర్మ సాగరం గ్రామంలో జగనన్న కాలనీ పనులను శనివారం నర్సీపట్నం ఆర్డిఓ జయరాం పరిశీలించారు. సర్పంచ్ కన్నయ్య నాయుడుతో మాట్లాడుతూ.. గృహాల నిర్మాణంలో ఇబ్బందులు ఎదురైతే తన దృష్టికి తీసుకు రావాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ అధికారులు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి

నక్కపల్లి:గృహ నిర్మాణాలు వేగవంతంగా పూర్తి చేయాలని ఎంపీడీవో సీతారామరాజు, ఈఓపిఆర్‌డి వెంకటనారాయణ సూచించారు. మండలంలోని చినతీనార్ల గ్రామంలో శనివారం జగనన్న లేఅవుట్‌ను సందర్శించారు. నిర్మాణ దశలో ఉన్న గృహాలను పరిశీలించి, లబ్ధిదారులతో మాట్లాడారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు త్వరితగతిన గృహ నిర్మాణ పనులను పూర్తి చేయాలని సూచించారు. ఇంకా గృహ నిర్మాణ పనులను ప్రారంభించని లబ్ధిదారులు వెంటనే పనులు చేపట్టాలన్నారు. పేమెంట్లకు సంబంధించి ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూస్తామన్నారు. లే అవుట్‌లలో అన్ని వసతి సౌకర్యాలు కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ రాజు, ఎలక్ట్రికల్ ఏఈ కృష్ణ, పంచాయతీ కార్యదర్శి, వర్క్ ఇన్స్పెక్టర్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ తదితరులు పాల్గొన్నారు.

చినతీనార్లలో మాట్లాడుతున్న అధికారులు

కోటవురట్ల:జగనన్న కాలనీలో గృహ నిర్మాణాలు పూర్తి చేయాలని మండలం ప్రత్యేక అధికారి ఉదయశ్రీ సూచించారు. పి.కొత్తపల్లి, రామన్నపాలెం గ్రామాలలో నిర్మిస్తున్న కాలనీలను ఆమె సందర్శించారు. మండల కేంద్రంలోని సమావేశం మందిరంలో అధికారులతో మాట్లాడుతూ, రానున్న వేసవిలో తాగునీటి సమస్య లేకుండా గ్రామాల్లో చర్యలు చేపట్టాలని సూచించారు. అభివృద్ధి కార్యక్రమాలపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో చంద్రశేఖర్, పిఆర్ ఇంజనీరు వర్మ, హౌసింగ్ ఇంజనీర్ జగదీశ్వరరావు, పిఓపిఆర్డి ప్రేమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆహ్వాన పత్రికను ఇస్తున్న ప్రధాన అర్చకులు

ఎమ్మెల్యే బాబూరావుకు ఆహ్వానం

ప్రజాశక్తి -నక్కపల్లి:ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన ఉపమాక వెంకన్న కళ్యాణ ఉత్సవ ఆహ్వాన పత్రికను శనివారం ఎమ్మెల్యే బాబురావుకు ఆలయ ప్రధాన అర్చకులు గొట్టుముక్కల వరప్రసాద్ ఆచార్యులు, సిబ్బంది కలిసి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాబురావు కల్యాణోత్సవాలకు సంబంధించి దేవాలయంలో చేపడుతున్న ఏర్పాట్లపై అడిగి తెలుసుకున్నారు. సుదూర ప్రాంతాల నుండి వచ్చే భక్తులకు మంచినీటి సౌకర్యం, ఉచిత ప్రసాదములు అందజేయాలన్నారు. కల్యాణోత్సవంలో చేపట్టే పనులకు సంబంధించి వివిధ శాఖల అధికారుల సహకారం తీసుకోవాలని సూచించారు. ఉత్సవాల ఏర్పాట్లకు సంబంధించి తిరుమల తిరుపతి దేవస్థానం ఉన్నతాధికారులతో చర్చించనున్నట్లు తెలిపారు. మార్చి 3న జరిగే వార్షిక కళ్యాణోత్సవాలకు భక్తులు రావాలని కోరారు.ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు శీరం నరసింహమూర్తి, కొల్లాటి బుజ్జి, రవితేజ పాల్గొన్నారు.

'అసత్య ప్రచారం తగదు'

ప్రజాశక్తి -యస్.రాయవరం:గ్రామాభివృద్ధి కోసం శ్రమిస్తున్న తనపై అసత్య ప్రచారం చేస్తూ నిందలు మోపడం తగదని పెద ఉప్పలం సర్పంచ్ కోశెట్టి వెంకటరమణ తెలిపారు. స్థానిక విలేకరులతో ఆయన శనివారం మాట్లాడుతూ, పెద ఉప్పలం గ్రామంలో కేంద్ర ప్రభుత్వం పథకంలో భాగంగా సుమారు పద్దెనిమిది వందల నీటి కుళాయిల ఏర్పాటుకు గాను ఇప్పటి వరకు నాలు గువందల డెబ్బై ఐదు కనెక్షన్లు ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు.గ్రామ ప్రజలకు కుళాయి కనెక్షన్ ఇచ్చే క్రమంలో ఎటువంటి రాజకీయ దురుద్దేశాలు లేకుండా కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా స్థానిక నాయకులు, అధికారులతో కలిసి పని చేస్తున్నానని తెలిపారు.కొంతమంది పశువుల పాకలకు, వ్యాపార కేంద్రాలకు కుళాయి కనెక్షన్ కావాలని అడిగినప్పుడు తాను ఆమోదించక పోవడంతో తనపై సోషల్ మీడియాలో దుష్ప్రచారం సాగిస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

విద్యార్థులకు పలు రకాల పోటీలు

ప్రజాశక్తి నర్సీపట్నం రూరల్:అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎస్ఐసి ఏజెంట్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శనివారం నర్సీపట్నం వివేకానంద కళాశాలలో 'నేటి సమాజంలో మహిళల పాత్ర' అనే అంశంపై విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ కార్యదర్శి దేవాడ సత్యనారాయణ మాట్లాడుతూ, మార్చి 8న మహిళా దినోత్సవం సందర్భంగా నర్సీపట్నం సిటీ క్లబ్ ఆవరణలో మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించనున్నామని తెలిపారు. ఇందులో భాగంగా విద్యార్థులకు వివిధ అంశాలపై పోటీలు నిర్వహిస్తున్నామని, మహిళలకు స్టార్ వనిత, పరిపూర్ణ మహిళ పోటీలు నిర్వహిస్తున్నామని చెప్పారు. విజేతలకు మార్చి 8న బహుమతులు అందజేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు పాల్గొన్నారు.

వ్యాస రచన రాస్తున్న విద్యార్థులు

సాంస్కృతిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న విద్యార్థులు

టెన్త్ విద్యార్థులకు ఘన వీడ్కోలు

ప్రజాశక్తి- నర్సీపట్నం రూరల్:మండలంలోని చెట్టుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం పదో తరగతి విద్యార్థులకు ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా పాఠశాల కమిటీ చైర్మన్ సముద్రాల మాట్లాడుతూ, విద్యార్థులందరికీ నాణ్యమైన విద్యను అందించడంలో పాఠశాల కమిటీ, తల్లిదండ్రుల సహకారం చాలా ముఖ్యమైందన్నారు. పదో తరగతి పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించి పాఠశాలకు ప్రత్యేక గుర్తింపును తీసుకురావాలన్నారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బి.రాఘవనాయుడు, గ్రామ పెద్దలు గజాల సూరిబాబు, ఇన్నం రమణగారు, యర్రంశెట్టి పాపారావు, వూడి చక్రవర్తి పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాలు ఏర్పాటు

ప్రజాశక్తి-రావికమతం:మండలంలోని కమగుంట గ్రామంలో తలెత్తిన విద్యుత్ సమస్యపై శనివారం పలు వార్తాపత్రికలలో వచ్చిన వార్తలకు స్పందించిన రావికమతం విద్యుత్ శాఖ ఏఈ సిబ్బందితో నూతన విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేసి ఓల్టేజీ సమస్యను పరిష్కరించారని సర్పంచ్ దాసరి సూర్య కుమారి వరహాలు తెలిపారు. సర్పంచ్ మాట్లాడుతూ, ఇళ్లపై వేలాడుతున్న విద్యుత్ వైర్లను తొలగిస్తామన్నారు. ఏఈ నందన్ మాట్లాడుతూ, గ్రామంలో మూడు ట్రాన్స్ఫార్మర్లు అమర్చడం జరిగిందని తెలిపారు. దీంతో లో వోల్టేజి సమస్య పూర్తిగా పరిష్కారం అవుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబరు ప్రగడ నాగేశ్వరరావు, ఎస్టీ సెల్ గ్రామ శాఖ అధ్యక్షుడు నాని, రాజనాయుడు, వెంకటి పాల్గొన్నారు.

ఏర్పాట్లు చేస్తున్న ఎఇ

భూ సర్వే వివరాలు వెల్లడి

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని నాగన్నదొరపాలెంలో రెండు నెలల క్రితం నిర్వహించిన సమగ్ర భూ సర్వేలో ఏవైనా అభ్యంతరాలుంటే తెలియజేయాలని డిటి బాలుదొర రైతులను కోరారు. నర్సింగపల్లి రామకోవెల్లో శనివారం ఏర్పాటు చేసిన గ్రామ సభలో సర్వేలో సేకరించిన వివరాలను వెల్లడించారు. రైతులు చూపిన భూ హద్దుల ప్రకారం రికార్డులు పరిశీలించి నిర్ధారణ చేసిన అనంతరం ఈ వివరాలు గ్రామ సభలో తెలియజేస్తున్నట్లు వివరించారు. రైతులు తమ వివరాలను పరిశీలించి గ్రామ వాలంటీర్ల దగ్గర అందుబాటులో ఉన్న జాబితా ఆధారంగా తమ ఆక్షేపణలను తెలియజేయాలన్నారు.
భూమి నమోదు ఎక్కువ తక్కువ, పేర్లు, తండ్రి పేర్లు సర్వే నంబర్లు, సరిచూసుకొని లిఖితపూర్వకంగా రెండు మూడు రోజుల్లో అభ్యంతరాలను తెలియజేస్తే పరిశీలించి తగిన చర్యలు చేపడతామన్నారు. నాగేంద్రపాలెం రెవిన్యూ పరిధిలో 500 వరకు ఎల్‌పి నెంబర్లు నమోదయ్యాయని తెలిపారు. వీటి ఆధారంగానే కొత్త వివరాలతో భూ హక్కు పత్రాలు తయారు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ నాగరాజు, మండల్ సర్వేయర్ చినబాబు, వీఆర్వో అప్పారావు, విఆర్ఎ గౌతమ్‌రాజు, గ్రామ పెద్దలు రైతులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డిటీ బాలుదొర

సరుకులు ఇస్తున్న టిడిపి నేతలు

బాధితునికి సరుకుల పంపిణీ

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలం రేబాక గ్రామంలో గురువారం అర్ధరాత్రి సమయంలో గ్రామానికి చెందిన కర్రి నాగేశ్వరరావుకు చెందిన పూరిల్లు అగ్ని ప్రమాదంలో దగ్ధం కావడంతో ఇంట్లో సామగ్రి దగ్ధమైంది. ఈ మేరకు స్పందించిన తెలుగుదేశం పార్టీ మండల శాఖ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు గింజాల లక్ష్మణరావు, ఎంపీటీసీ సభ్యులు కుంచె మధు, పార్టీ నాయకులు రమణ తదితరులు కుటుంబ సభ్యులను శనివారం పరామర్శించారు. బియ్యం బస్తాలు, నిత్యావసర సరుకులు, వస్త్రాలను అందజేశారు. బాధిత కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని భరోసానిచ్చారు. మాజీ ఎమ్మెల్యే వంగలపూడి అనిత సూచనల మేరకు బాధిత కుటుంబ సభ్యులకు సరుకులను అందజేశామని వెంకటేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు నానాజీ, నాగరాజు, రమేష్, చిన్న అప్పారావు, సత్యప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

రమేష్‌కు ఘన సత్కారం

ప్రజాశక్తి-కోటవురట్ల:వైసిపి పబ్లిక్ వింగ్ బిసి సెల్ జిల్లా అధ్యక్షునిగా ఎంపికైన పైల రమేష్‌ను ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ శనివారం క్యాంపు కార్యాలయం వద్ద ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పార్టీ బలోపేతానికి, బీసీల అభివృద్ధికి కృషి చేయాలన్నారు.

రమేష్‌ను సన్మానిస్తున్న మంత్రి అమర్నాథ్

పాత్రికేయులకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి -యస్.రాయవరం:పెదగుమ్ములూరు గ్రామంలో వేంకటేశ్వర పోలీ క్లినిక్ వైద్యుడు పి.అనిల్ వర్మ నేతృత్వంలో మేన్ కైండ్ ఫార్మా సహకారంతో స్థానిక పాత్రికేయులకు శనివారం వైద్య పరీక్షలు నిర్వహించారు. బీపి, షుగర్, కొలెస్టరాల్, ఈసిజి, ట్రైగ్లిసరేట్స్ వంటి పరీక్షలు చేసి వారికి తగు సూచనలు సలహాలు అందించారు. అవసరమైన మందులను ఉచితంగా అందజేశారు. వైద్యులు అనిల్ వర్మకు విల్కేరులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మేనే కైండ్ ఫార్మా మేనేజర్లు కె.సురేష్ కుమార్, నాగేశ్వరరావు వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

పరీక్షిస్తున్న వైద్యులు

గెలిపిస్తే సమస్యలపై ప్రశ్నించి, పోరాడుతా..

-ఉత్తరాంధ్ర పట్టభద్రుల పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభ- పలుచోట్ల ముమ్మరంగా ప్రచారం

గాజువాకలో ప్రచారం చేపడుతున్న రమాప్రభ

గెలిపిస్తే సమస్యలపై ప్రశ్నించి, పోరాడుతానని పిడిఎఫ్ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభ తెలిపారు. గాజువాక పంచవటి టౌన్ షిప్‌లో ఆమె ప్రచారం చేపట్టారు. అలాగే అనకాపల్లి జిల్లాలో ఆయా సంఘాల నేతలు ముమ్మరంగా ప్రచారం చేశారు.

ప్రజాశక్తి -యంత్రాంగం

గాజువాక :ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలు, ప్రజా సమస్యలపై శాసనమండలిలో ఉన్న ఆరుగురు పిడిఎఫ్ ఎమ్మెల్సీలు ప్రశ్నించి పోరాడుతున్నారని, వారికి మరింత మద్దతుగా ఉండాలంటే ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీగా తనను గెలిపించాలని పిడిఎఫ్ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభ కోరారు. ఉత్తరాంధ్ర సమస్యలపై అవగాహన, వాటి పరిష్కారానికి ప్రశ్నించి, పోరాడే స్వభావం తనకు ఉందని, గెలిస్తే ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటానని భరోసానిచ్చారు. శనివారం గాజువాక పంచవటి టౌన్ షిప్‌లో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతూ, ఉత్తరాంధ్ర ప్రాంతం ఉపాధి, విద్య వైద్యం ఇతర మౌలిక సదుపాయాల్లో వెనుకబడి ఉందన్నారు. 24 లక్షల హెక్టార్ల సాగుభూమిలో 20 శాతానికి కూడా నీటి సదుపాయం లేదన్నారు. విభజన హామీల్లోని ప్రత్యేకహోదా, ఉత్తరాంధ్రకు ప్రత్యేక ప్యాకేజీ, గిరిజన వర్సిటీ, సుజల స్రవంతి, విశాఖ కేంద్రంగా రైల్వేజోన్ ఇలా అనేకహామీలను కేంద్రం అమలు చేయకున్నా రాష్ట్రంలోని అధికార వైసిపి, ప్రధాన ప్రతిపక్షం టిడిపి ప్రశ్నించే సత్తా, దమ్ము లేదన్నారు. టౌన్ షిప్ అసోసియేషన్ అధ్యక్షులు చిన్నారావు, అసోసియేషన్ సభ్యులు, సిఐటియు నాయకులుఎం రాంబాబు, ఎ.లోకేశ్వరరావు, వనమాడ అప్పలరాజు, దాసరి అప్పారావు, సుబ్బన్న, ఎ. కోటేశ్వరరావు పాల్గొన్నారు.తర్వాత అక్కిరెడ్డిపాలెం, విశాఖ డెయిరీ కాలనీ, సింగపూర్ కాలనీల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

సిఐటియు నాయకులు జి.సుబ్బారావు ఆధ్వర్యంలో శనివార షీలానగర్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఉద్యోగులు, పెన్షనర్లకు నెలసరి వేతనాలు, పెన్షన్లు సక్రమంగా అందని పరిస్థితుల్లో, వాటి పరిష్కారానికి పోరాడాలంటే పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి రమాప్రభకు మొదటి ప్రాధాన్యత ఓటేసి గెలిపించాల్సిన అవసరం ఉందన్నారు.

ఎంవిపి.కాలనీ : సీతమ్మధార కెఆర్ఎం పార్కులో పిడిఎఫ్ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభ ఉదయం ప్రచారం చేపట్టారు. పార్కుకు వచ్చిన వాకర్స్‌ను కలిసి తనకు మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి గెలిపించాలని మనవి చేశారు. క్యాంపెయిన్‌లో సిఐటియు సీనియర్ నాయకులు జివిఎన్.రాజేశ్వరరావు, జివిఎన్. చలపతి, ఎం.శివనాగేశ్వరరావు, గిరిజన ఉద్యోగుల సంఘం అధ్యక్షులు సత్యనారాయణ, ఆర్‌టిసి హైర్‌బస్ యూనియన్ అధ్యక్షులు కెజె.అప్పారావు, ఐద్వా జోన్ కార్యదర్శి కె.కుమారి, వార్వా నాయకులు ఎం.ప్రదీప్ పాల్గొన్నారు.

అనకాపల్లి : పట్టణంలో పలుచోట్ల ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మొదటి ప్రాధాన్యత ఓటు రమాప్రభకు వేయాలని ఓటర్లను అభ్యర్థించారు. ఆంధ్రప్రదేశ్ స్టేట్ గవర్నమెంట్ కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ టీచర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు ఏవి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో విస్తృతంగా ఈ ప్రచారం సాగింది. స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, ఎన్టీఆర్ జిల్లా ఆసుపత్రి, ప్రభుత్వ కార్యాలయాల్లో పట్టభద్రులను ఓట్లు వేయాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్ శంకర్రావు, కాంటాక్ట్ అవుట్సోర్సింగ్ యూనియన్ నాయకులు నందీశ్వరరావు, అప్పారావు, ఏపీ కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఏ బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చోడవరంలో..

అనకాపల్లిలో ప్రచారం

కె.కోటపాడు : పిడిఎఫ్ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభకు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరుతూ మండలంలోని పాతవలస గ్రామంలో శనివారం ఏపీ రైతు సంఘం జిల్లా కోశాధికారి గండి నాయన బాబు, నాయకులు వనుము సూర్యనారాయణ, ప్రజా సంఘాల మండల కన్వీనర్ ఎర్ర దేవుడు ప్రచారం నిర్వహించారు.

చోడవరం : డాక్టర్ కోరెడ్ల రమాప్రభను గెలిపించాలని కోరుతూ మండలంలోని పలు గ్రామాల్లోనూ, చోడవరం పట్టణంలోనూ ఎమ్మెల్సీ ఓటర్ల ఇళ్లకు వెళ్లి విజ్ఞప్తి చేశారు. పోరాటాలకు వెన్నుదన్నుగా నిలబడే కోరెడ్ల ప్రమాప్రభ విజయం ఈ ప్రాంత ప్రజలకు ఎంత అవసరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు వివి శ్రీనివాసరావు, ఎస్ఎఫ్ఐ నాయుడు, ప్రజా సంఘాల నాయకులు శ్రీను, గణేష్, ఆది, సన్నిబాబు, ప్రవీణ్, తులసి తదితరులు పాల్గొన్నారు.

దుంప్రిగూడ:ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న పిడిఎఫ్ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభను గెలిపించాలని కోరుతూ సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.బి పోతురాజు ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్‌ను ఇస్తున్న మహాలక్ష్మినాయుడు

స్టడీ మెటీరియల్, బస్సు పాస్‌ల అందజేత

ప్రజాశక్తి -రావికమతం: మండలంలోని పలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న 17 మంది దివ్యాంగ విద్యార్థులకు స్టడీ మెటీరియల్, బస్సు పాసులను మేడివాడ జిల్లా పరిషత్ పాఠశాల ప్రత్యేక ఉపాధ్యాయుడు మహాలక్ష్మినాయుడు శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ప్రత్యేక ఉపాధ్యాయుడు మహాలక్ష్మి నాయుడు మాట్లాడుతూ, చిన్నపాచిల, గర్నికం కేజీబీవీ, దొండపూడి, కొత్తకోట, జెడ్.కొత్తపట్నం తదితర జడ్పీ హైస్కూల్లో చదువుతున్న దివ్యాంగ విద్యార్థులకు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయుల చేతుల మీదుగా అందజేశామన్నారు. పాఠశాలకు రాని వారి ఇంటికి వెళ్లి స్టడీ మెటీరియల్, బస్సు పాసులను అందించామని తెలిపారు.

వెంకన్నను దర్శించుకున్న ఎస్‌పి

ప్రజాశక్తి -నక్కపల్లి:ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన ఉపమాక వెంకటేశ్వర స్వామిని శనివారం రాత్రి జిల్లా ఎస్పీ గౌతమీశాలి దర్శించుకున్నారు. ఆలయ విశిష్టత, చరిత్రను ప్రధానార్చకులు ప్రసాదాచార్యులు ఎస్పీకి వివరించారు. అదేవిధంగా మార్చి 2 నుండి ప్రారంభం కానున్న స్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా జరిగే ప్రత్యేక కార్యక్రమాలు, 3వ తేదీ రాత్రి కళ్యాణ మహోత్సవం జరుగుతుందని తెలిపారు. మాఢ వీధుల్లో తిరువీధి సేవ, రథోత్సవం, కల్యాణోత్సవానికి ఎంత సమయం పడుతుందని ఆమె అడిగి తెలుసుకున్నారు. ఉత్సవాల సందర్భంగా వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా ఏర్పాట్లు చేయాలని స్థానిక పోలీస్ అధికారులు, ఆలయ అధికారులను ఆమె ఆదేశించారు. ఎస్పి వెంట ఎస్ఐ శిరీష ఉన్నారు.

ఫ్లెక్సీల తొలగింపు

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో నర్సీపట్నంలో అనుమతులు లేని ఫ్లెక్సీలను మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు శనివారం తొలగించారు. టౌన్ ప్లానింగ్ సూపర్వైజర్ ప్రసాద్ తెలిపిన వివరాల మేరకు..కోడ్ ఆఫ్ కాండక్ట్ కింద రాజకీయ పార్టీలు తమ ప్రచారానికి పన్నులు చెల్లించాలన్నారు. పన్ను చెల్లింపు చేయకుండా చేస్తున్న ప్రచారం అనగా ఫ్లెక్సీలు కట్టడం, తదితర ప్రచారాన్ని అడ్డుకుంటామని తెలిపారు. పట్టణంలో 30 ఫ్లెక్సీల బోర్డులను తొలగించారు.



సన్మానిస్తున్న వైసిపి నాయకులు

అప్పారావుకు ఘన సన్మానం

ప్రజాశక్తి- చీడికాడ:అనకాపల్లి జిల్లా రైతు సంఘం అధ్యక్షుడిగా నియమితులైన ఎర్ర అప్పారావుని మండల వైసీపీ నాయకులు ఘనంగా సన్మానం చేశారు. చీడికాడ గ్రామానికి చెందిన ఎర్ర అప్పారావు అనకాపల్లి జిల్లా రైతు సంఘం విభాగం అధ్యక్షుడిగా నియమితులు కావడంతో వైయస్సార్ పార్టీ మండల అధ్యక్షులు గొల్లవిల్లి రాజబాబు ఆధ్వర్యంలో స్థానిక ఆ పార్టీ కార్యాలయంలో శనివారం ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు కురచా నారాయణమూర్తి, శ్రీను, గొల్లవెల్లి స్వామి నాయుడు, గ్రామ పార్టీ అధ్యక్షులు మహేష్, చైతన్య, పరవాడ రామారావు, అప్పలనాయుడు, ఎస్.మహేష్ కార్యకర్తలు పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యల పరిష్కారానికి చర్యలు

నర్సీపట్నం ఆర్‌డి జయరాం

ప్రజాశక్తి -కొత్తకోట:రెవెన్యూ సంబంధిత సమస్య లపై సత్వర పరిష్కారానికి చర్యలు చేపట్టామని నర్సీపట్నం ఆర్‌డిఒ జయరాం తెలిపారు. రావికమతం మండల రెవెన్యూ కార్యాలయంలో చీడికాడ, వి.మాడుగుల, రావికమతం మండలాల తహసీల్దార్లతో శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి నెల భూముల రీ సర్వే, ఎంఎల్‌సి ఎన్నికల పరిశీలన, సచివాలయాల ప్రగతి తదితర అంశాలపై సమీక్ష సమావేశాలు నిర్వహిస్తున్నా మన్నారు. వివిధ రకాల ధ్రువపత్రాల మంజూరులో జాప్యంపై క్షేత్రస్థాయిలో పరిశీలన చేస్తూ త్వరితగతిన మంజూరుకు చర్యలు చేపడుతున్నట్టు ఆర్డిఒ వివరించారు. పెండింగ్‌లో ఉన్న రెవెన్యూ పరమైన సమస్యల పరిష్కారానికి సిబ్బందిని అప్రమత్తం చేస్తున్నట్టు పేర్కొన్నారు. అనంతరం మూడు మండలాలకు చెందిన రెవెన్యూ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రావికమతం తహసీల్దార్ మహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఆర్‌డిఒ

సాయం చేస్తున్న సంస్థ ప్రతినిధులు

విద్యార్థినికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి -రోలుగుంట:మండలంలోని బుచ్చింపేట గ్రామానికి చెందిన దివ్య ఇంటర్ సెకండ్ ఇయర్ పూర్తి చేసింది. ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ రాక పోవడంతో ప్రైవేట్ కళాశాలలో ఫీజు కట్టలేక ఇబ్బంది పడుతోంది. ఈ విషయాన్ని ఆల్వేస్ హెల్ప్ అదర్స్ ఫౌండేషన్ ప్రతినిధులు తెలుసుకొన్నారు. ఫీజుకు సరిపడా నగదును అందజేశామని సంస్థ స్థాపకుడు కిషోర్, చిన్నబాబులు, తేజ, సాయి శనివారం తెలిపారు. ఉన్నత చదువులకు సహాయం చేయడానికి ముందుకు రావడంతో విద్యార్థిని సంతోషం వ్యక్తం చేసింది.

కదిలిన అధికార యంత్రాంగం

దోలీ మోతలపై స్పందించిన జిల్లా కలెక్టర్ - రోడ్డు నిర్మాణానికి సర్వే చేపట్టాలని ఆదేశం

ప్రజాశక్తి-రోలుగుంట:ఇటీవల డోలిమోతల కారణంగా పెదగరువు గ్రామానికి చెందిన ఒక శిశువు మృతి చెందిన నేపథ్యంలో జిల్లా కలెక్టర్ స్పందించారు. రోడ్డు నిర్మాణం కోసం సర్వే చేపట్టాలని అధికారులను ఆదేశించారు. దీంతో, శనివారం అధికారులు ఉరుకులు పరుగులు తీశారు. మండలంలో వైబి.పట్నం నుండి లోసింగి మీదుగా పెదగరువు వరకు సుమారు నాలుగు కిలోమీటర్ల మేర రహదారి ఏర్పాటుకు జిల్లా కలెక్టర్ రవిపట్టన్‌శెట్టి ఆదేశాల మేరకు శనివారం డివిజన్, మండల స్థాయి అధికారులు పర్యటించారు. పెదగరువు నుండి లోసింగి మీదుగా వైబి.పట్నంనకు రహదారి ఏర్పాటుకు సర్వే అధికార యంత్రాంగం సర్వే నిర్వహించింది. ఈ కార్యక్రమంలో ప్రత్యేకాధికారి ప్రసాదరావు, పంచాయతీ డిఇ ప్రసాద్, పంచాయతీరాజ్ ఎఇ ఉమా మహేశ్వరుడు, డిటి త్రివేణి పాల్గొన్నారు.

సమస్యను తెలుసుకుంటున్న అధికారులు

నేడు ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-యస్.రాయవరం:పెదగుమ్ములూరు లో ఈనెల 26న ఉచితవైద్యశిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు ప్రముఖ వైద్యులు బి.బంగారయ్య తెలిపారు. శనివారం ఆయన ప్రకటన విడుదల చేశారు. ఈనెల26న ఆదివారం ఉదయం పది గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు ఉచిత మెగా వైద్యశిబిరం ద్వారా వైద్య సేవలను అందిస్తామన్నారు. అన్ని రకముల వ్యాధులను ప్రముఖ వైద్యులతో ప్రత్యేకంగా పరీక్షించి ఉచితంగా మందులు అందిస్తామన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్: 8333093121, 8099246209, 8074269054 నెంబర్లకు సంప్రదించాలని సూచించారు.